RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 02 అక్టోబర్ 2026 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:107

# ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

**ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ, డీఆర్ పెంచుతూ ప్రభుత్వ ఉత్తర్వులు, మంత్రిమండలిలో తీసుకున్న నిర్ణయాలపై మంత్రులు పొన్నం ప్రభాకర్ గారు, అడ్లూరిలక్ష్మణ్ కుమార్ తో కలిసి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**






**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు రెండు డీఏలు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగినమంత్రివర్గంఆమోదంతెలిపింది. 2024 నుంచి బకాయి ఉన్న డీఏల్లో రెండు డీఏలను వెంటనే మంజూరు చేయాలని నిర్ణయించింది. ఎరియర్స్‌ను వాయిదాల్లో చెల్లిస్తారు.

ఆర్థికంగా భారమైనప్పటికీ ఇటీవల ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు డీఏ, పెన్షనర్లకు డీఆర్ మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వంపై ఏటా రూ.2500 కోట్ల భారం పడనుంది.

రాష్ట్రంలో ఎల్‌నినో కారణంగా తలెత్తిన పరిస్థితులపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రిమండలి సమావేశం సుదీర్ఘంగా చర్చించింది. ప్రస్తుత వర్షాకాలంలో దాదాపు 17 శాతం వర్షపాతం లోటు ఉంది. నిన్నటితో రుతుపవనాల కాలం కూడా ముగిసింది. దాదాపు 235 మండలాల్లో తీవ్ర వర్షాభావంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కరువు ప్రాంతాల్లో తక్షణం చేపట్టాల్సిన చర్యలపై కేబినెట్ సబ్‌కమిటీలో సమగ్రంగా చర్చించాలని సమావేశం నిర్ణయించింది. ఈ అంశంపై త్వరలోనే అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. రైతు సంఘాలతో పాటు వివిధ రంగాల నిపుణులతో భేటీలు ఏర్పాటు చేస్తారు. మంత్రిమండలిలో తీసుకున్న నిర్ణయాలపై మంత్రులు పొన్నం ప్రభాకర్ గారు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మీడియాకు వెల్లడించారు.

ఎల్‌నినో పరిస్థితులు, చేపట్టాల్సిన ఉపశమన చర్యలపై అన్ని వర్గాల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. కరువు మండలాల ప్రకటనతో పాటు రాష్ట్రానికి తగిన సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర మంత్రివర్గం విజ్ఞప్తి చేసింది. ఆ మేరకు మంత్రుల బృందం త్వరలోనే ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను నివేదించాలని మంత్రిమండలి నిర్ణయించింది.

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లకు తగిన ఏర్పాట్లు చేయాలి. త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి. ఈ సీజన్‌లో దాదాపు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని పౌర సరఫరాల విభాగం అంచనా వేసింది. కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం.

ఎల్‌నినో పరిస్థితులతో నేపథ్యంలో రాష్ట్రంలో విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలో సాధారణంగా ఒక్క రోజుకు 15,000 మెగావాట్ల విద్యుత్తు వినియోగం ఉండగా.. ఈ సీజన్‌లో అది రికార్డు స్థాయిలో 19,892 మెగావాట్ల పీక్ డిమాండ్‌కు చేరింది. గత ఏడాది మొత్తంలో 16,613 మెగావాట్ల గరిష్ఠ వినియోగం నమోదైంది.

విద్యుత్తు డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్తు ఉత్పత్తి, తగినంత విద్యుత్తు సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్తు కోత లేకుండా సరఫరా చేసేందుకు అవసరమైనంత విద్యుత్తును సమకూర్చుకోవాలని, డిమాండ్ మేరకు కొనుగోలు చేయాలని నిర్ణయించింది.

భవిష్యత్తు డిమాండ్, అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్తగా పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి, విద్యుత్తు సమీకరణపై దృష్టి పెట్టాలని నిర్ణయించింది. దాదాపు 7,800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యంగా యూనిట్లు నెలకొల్పేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

ఇందులో 3,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తు, 4,000 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్, 800 మెగావాట్ల పవన విద్యుత్తు యూనిట్ల ఏర్పాటు ప్రతిపాదనలపై మంత్రివర్గం చర్చించింది. కేంద్ర నిబంధనల మేరకు బిడ్డింగ్ విధానంలో ఈ ప్రాజెక్టులు చేపట్టాలని నిర్ణయించింది.

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని నిర్ణయం తీసుకుంది. పూర్తిగా ప్రభుత్వ నిధులతోనే ఈ మార్కెట్ ఏర్పాటు చేయాలని సూచించింది.

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పున: సమీక్షించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఈపీసీ విధానంలో చేపట్టిన ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉంటే రద్దు చేయాలని అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా 10 ఈపీసీ సాగునీటి ప్రాజెక్టులను నిలిపివేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

తెలంగాణలో డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్‌కు ప్రత్యేక పాలసీ అమలు చేసే ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసింది. కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ రూపొందించిన డిజిటల్ అడ్వర్టైజ్‌మెంట్ పాలసీకి అనుగుణంగా రాష్ట్రంలో ఈ పాలసీ రూపొందించారు. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ పోస్టుతో పాటు మరో నలుగురు గ్రూప్ 1 అధికారులను కూడా ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున పని చేసేందుకు నియమించాలని మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

## హైదరాబాద్ సిటీ పోలీస్ పరిధిలో భారీ పునర్వ్యవస్థీకరణ

హైదరాబాద్ సిటీ పోలీస్ పరిధిలో జోన్లు, డివిజన్లు, పోలీస్స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ చోటు చేసుకుంది. హైదరాబాద్ సిటీ పోలీస్ పరిధిలో మొత్తం 76 ప్రాంతాలపై మార్పులు జరిగాయి. కొన్ని పోలీస్స్టేషన్ల పరిధులు ఇతర జోన్లు, డివిజన్లకు బదిలీ చేసారు. మార్కెట్ పీఎస్ పరిధిలోని పలు ప్రాంతాలు మల్కాజిగిరి కమిషనరేట్కు బదిలీ అయ్యాయి. మహేశ్వరం, శంషాబాద్, సైబరాబాద్ పరిధుల్లోనూ మార్పులు జరిగాయి. ఆర్జీఐఏ పీఎస్ పేరును శంషాబాద్ పీఎస్గా మార్పు చేసారు. శంషాబాద్ డివిజన్లో ఆర్జీఐఏ పీఎస్, శంషాబాద్ పీఎస్ల పునర్వ్యవస్థీకరణ జరిగింది. రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. అబ్దుల్లాపూర్మెట్, మీర్పేట్ ప్రాంతాల పోలీస్ పరిధుల్లో మార్పులు జరిగాయి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సనత్నగర్ ప్రాంతాల్లోనూ పరిధుల పునర్విభజన జరిగింది. ట్రాఫిక్ పోలీస్ పరిధిలోనూ జోన్లు, డివిజన్ల పునర్వ్యవస్థీకరణ చేసారు.

వుమెన్ సేఫ్టీ వింగ్ పరిధిలోనూ కొత్తగా జోన్ల కేటాయింపు జరిగింది. జోనల్ సైబర్ సెల్ పరిధులను కూడా సర్కార్ పునర్వ్యవస్థీకరించింది. ఉ.వా.ఓబ.జెసీ.84 ద్వారా పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

## బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు పెట్టుకోబోదని స్పష్టం చేసిన కిషన్ రెడ్డి

**ఓటమి భయంతోనే కాంగ్రెస్ ఈసీపై దాడి చేస్తోందని ఆరోపణ**

**హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా సీఎం రేవంత్ వ్యాఖ్యలు**

**కాంగ్రెస్ దొంగ ఓట్లను చేర్పించే ప్రయత్నం చేస్తోందని విమర్శ**



ఖైరతాబాద్ లో బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ నాయకుడు జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాజకీయాల్లో ఈ పొత్తుపై జరుగుతున్న ఊహాగానాలకు ఆయన తెరదించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యామని, అయితే ఈసారి బీజేపీ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే ముందుకు వెళుతుందని స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణలోని ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు బొగ్గు కేటాయింపులపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే, సింగరేణి బొగ్గును వినియోగించుకునేలా ఈ ప్లాంట్‌కు ఎందుకు రూపకల్పన చేయలేదో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వైఖరిని కిషన్ రెడ్డి తీవ్రంగా ఎండగట్టారు. రాహుల్ గాంధీ రాజ్యాంగబద్ధమైన సంస్థలపై, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌పై అనుచిత విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో మార్పు అనేది ప్రజల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందే తప్ప, రాహుల్ గాంధీ వల్ల సాధ్యం కాదన్నారు. శివుడు, రాముడిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీశాయని, వాటిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు.ఓటమి భయంతోనే కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు కేంద్ర ఎన్నికల సంఘంపై, బీజేపీపై అసత్య ఆరోపణలు చేస్తున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రాంతాల వారీగా ప్రజల మధ్య చిచ్చుపెడుతోందని, తొలగించిన ఓట్లను (మరణించిన వారు, అక్రమ చొరబాటుదారులు) తిరిగి ఓటర్ల జాబితాలో చేర్పించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఖైరతాబాద్‌లో బీజేపీ గెలుపు తథ్యమని, తమ పార్టీ ఓట్లను దొంగిలించదని, కేవలం ప్రజల హృదయాలను గెలుచుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

## నువ్వు నల్లమల పులికాదు.. నువ్వు చంద్రబాబు దగ్గర పిల్లి కేటీఆర్

హైదరాబాద్ ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకూ అన్నదాతలు గోస పడుతున్నారు. ఆరు గంటలు కూడా కరెంట్ వస్తలేదని అవస్థలు పడుతున్నరు. మీరు మా పక్షాన ఈ ప్రభుత్వంపై కొట్లాడాలె అని మేము ఎక్కడికి వెళ్లిన కోరుతున్నరు. రైతుబంధు వస్తలేదు, కరెంట్ వస్తలేదు, యూరియా దొరుకుతలేదు అని కంటతడిపెడుతున్నరని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.

కేసీఆర్ హయాంలో ఒక్క ఫోన్ కొడితే యూరియా పొలం వద్దకు వచ్చేదని చెబుతున్నరు. కేసీఆర్ ఆనాడే చెప్పారు. మోసపోకండి.. మోసపోతే.. గోసపడ్తం అని.. ఇవాళ అన్నివర్గాల ప్రజలు గోస పడుతున్నరు. పదేళ్లు అయ్యింది కదా, కొత్తవాళ్లను చూద్దాం అని అనుకోవడం వల్ల ఈ పరిస్థితి వచ్చింది. 50ఏళ్లు ఏ కాంగ్రెస్ రైతులను సావగొట్టిందో అదే కాంగ్రెస్ మళ్లీ వచ్చి నెత్తి మీద కూర్చున్నది. రేవంత్ రెడ్డి ఆనాడే స్పష్టంగా చెప్పిండు.. వెనకటి రోజులు మళ్ల తెస్త అన్నడు. తెచ్చి చూపెట్టిండు, రైతులకు కన్నీళ్లు తెచ్చిండు. సాగునీటి లేని రోజులు, కరెంట్ రాని రోజులు తెచ్చిండు. ప్రజలు మోసం చేసేటోళ్లనే నమ్ముతరు అని ఆనాడే రేవంత్ రెడ్డి చెప్పిండు. సెక్రెటేరియట్ కింద సొరంగం తవ్వుతున్నరు అని దివానా మాటలు మాట్లాడిండు. కేసీఆర్ పెద్ద రాజభవనం కడుతున్నరు, అందులో బంగారు బాత్ రూంలు ఉన్నై అన్నడు. ఇప్పుడు అందులో ఎవరు ఉంటున్నరో మీ అందరికీ తెలుసు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అయిన ఖర్చే 80 వేల కోట్లు. లక్ష కోట్లు అవినీతి చేసిండ్రు అని చిల్లర మాటలు మాట్లాడిండు. ఆయన అబద్ధాలు ఎలా ఉంటాయో చెప్పడానికి ఇవన్నీ ఉదాహరణలని అన్నారు.

కాళేశ్వరం మీద కమిషన్ వేసినవ్.. తుస్సుమన్నది కరెంట్ కొనుగోళ్ల మీద కమిషన్ వేసిండు.. తుస్సుమన్నది ఫార్ములా ఈ రేసు మీద కమిషన్ వేసిండు.. అది తుస్సు మన్నది. ఈ బ్యాంకులో నుంచి ఆ బ్యాంకులోకి పైసలు పంపినం.. దానిపై వేసిన విచారణ కూడా తుస్సుమన్నది. ప్రజల మనసు ఖాళీగా ఉంటే, రేవంత్ రెడ్డి చెప్పిన హామీలు గుర్తుకొస్తై.. 420 హామీలు ఏమైనై, గ్యారెంటీలు ఏమైనై అని ప్రజలు నిలదీస్తరని అటెన్షన్ డైవర్షన్ చేస్తున్నడు. ప్రజల మనసులో ఏదైనా నాటాలె, ఆరు నెలలు దుకాణం నడపాలె.. అని చూస్తున్నడని అన్నారు.

సిరిసిల్లకు నిన్న ముఖ్యమంత్రి వచ్చిండు. బీఆర్ఎస్ హయాంలో చేనేత కార్మికుల ఆత్మహత్యలు ఆగిపోయినై. కాంగ్రెస్ హయాంలో మళ్లీ 35 మంది చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నరు. ఉన్న బతుకమ్మ చీరలు ఆర్డర్లు ఆగిపోయినై, పిల్లల స్కూలు యూనిఫారమ్ ఆర్డర్లు ఆపేసిండు. చనిపోయిన చేనేత కార్మికులకు 10 లేదా 20 లక్షల పరిహారం ప్రకటిస్తడని ఆశించినా.. కానీ ఏం ప్రకటన లేదు. ఆగిపోయిన నేతన్న బీమా గురించి చెబుతడని అనుకున్నబతుకమ్మ చీరలు ఆపేసిండు.. దాని గురించి చెప్తడని అనుకున్న. నీళ్లిచ్చే మిషన్ భగీరథ బంద్ అయ్యింది. దాని గురించి చెప్తడని అనుకున్నా.. శత్రుదేశం మీద దండయాత్రకు పోయినట్టు పోయిండు.. నల్లమల పులి అంటడు. నాలుగువేల పోలీసులను పెట్టుకుని పోయిండు. నువ్వు నల్లమల పులికాదు.. నువ్వు చంద్రబాబు దగ్గర పిల్లి మా వాళ్లను ఉదయం నుంచే అరెస్టుచేశారు. దుకాణాలన్నీ బంద్ పెట్టించారు. రేవంత్ రెడ్డి చుట్టూ, పోలీసులు తప్ప అక్కడ ప్రజలు లేనే లేరు. న్న మళ్లీ అవే పుక్కిటి పురాణాలు. ముఖ్యమంత్రి ఫ్రస్ట్రేషన్ ఏంటో అర్థమైతలేదు. ముఖ్యమంత్రి, ఆయన అన్నదమ్ములు.. బావమరిది దోచుకుంటున్నారు.. మీ బావమరిది సృజన్ రెడ్డి కంపెనీకి అర్హత లేదు అని అడిగేసరికి, వెయ్యి కోట్ల టెండర్ ఎలా వచ్చిందని అని అడిగే సరికి ముఖ్యమంత్రికి కోపం వస్తుంది. తొమ్మిదో తరగతి ఫెలైన కొండల్ రెడ్డి.. ఏరోస్పేస్ ఇంజనీరు అయిపోయిండు.. 200 కోట్ల విలువ చేసే భూమి 7 కోట్ల కు ఎట్ల ఇచ్చినవ్ అని అడిగితే కోపం వస్తుంది. రేవంత్ రెడ్డి అన్నజగదీష్ రెడ్డి వెయ్యి కోట్ల పెట్టుబడి పెడ్త అని అమెరికా నుంచి వచ్చిండు. నిన్నటి దాకా ఏం లేనోళ్లు ఇన్ని వేల కోట్లు ఎట్ల పెడుతున్నరు అని అడిగాం. అదానీని దాటిపోయేలా ఉన్నావు.. అనే సరికి రేవంత్ రెడ్డికి కోపం వచ్చింది. మా బండారం బయటపెడ్త అన్నావ్.. నిన్న ఏం బయటపెట్టినవ్. 1985 లో మొదటి సారి కేసీఆర్ గారు ఎమ్మెల్యే అయ్యారు. తరువాత



మంత్రి, డిప్యూటీ స్పీకర్, కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రి అయ్యారు. 43 ఏళ్ల నుంచి శాసనసభ, లేదా పార్లమెంట్ లో ఉన్నారు. ఆయన ఎప్పుడు మాకు బాగా చదువుకోండి.. అని చెప్పేవారు. మంచిగా చదువుకుని అమెరికాలో ఆరు ఏళ్లు ఉద్యోగం చేశాను. నాలుగు పైసలు సంపాదించుకుని ఇండియాకు తిరిగి వచ్చాను 2004 సెప్టెంబర్ లో ఉద్యోగం మీదనే తిరిగి వచ్చాను. 2006లో కేసీఆర్ గారు రాజీనా?మా చేస్తే నాటి బై ఎలక్షన్ సమయంలో వచ్చి పనిచేశానని అన్నారు.

ప్రజాబలం

02 అక్టోబర్ 2026 శుక్రవారం

# నష్ట నివారణా చర్యల్లో ఈసీ

ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ తీసుకున్న నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి 14 అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయం బయటపడి తీవ్ర సంచలనం కలిగించాయి. దీంతో కాక్రోచ్ జనతా పార్టీ, విపక్షాలు ఆందోళనకు దిగడం, ఎన్నికల కమిషన్‌పై ప్రజల్లో ప్రతికూల అభిప్రాయం ఏర్పడడంతో ఎన్నికల కమిషన్ తన అప్రతిష్ఠను నివారించుకునే చర్యలు చేపట్టింది. కమిషనర్ల ఫిర్యాదులను కొంతవరకు అంగీకరించింది. ఇకపై సమావేశాలకు ముందే అజెండాను పంపుతామని, సమావేశాల తరువాత మినిట్స్ (నిర్ణయాల వివరాలను) అందజేస్తామని, తదితర వివరణలతోపాటు 'సర్' లో లోపాలు ఉన్నాయని పరోక్షంగా అంగీకరించింది. ఓటరు జాబితానుంచి ఎవరి పేరైనా తొలగించినట్టయితే వారిని తిరిగి జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లకు సూచించింది. అయితే 'పశ్చిమబెంగాల్‌లో న్యాయాధికారులు చేర్చిన ఓటర్లను తొలగించేందుకు 16.1లక్షల అప్పీళ్లను ఎవరు అనుమతించారు?' అని ఎన్నికల కమిషనర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు అడిగిన ప్రశ్నకు ఇప్పటికీ సమాధానం లేదు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్?ఐఆర్) వ్యవహారంపై కాంగ్రెస్, ఎన్నికల సంఘం మధ్య వివాదం మరింత ముదురుతోంది. సర్ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం ప్రకటించిన అరకొర చర్యలు సమస్యకు పరిష్కారం కాదని, ఇప్పటికే జరిగిన పరిణామాలపై నష్ట నివారణ ప్రయత్నమేనని (డ్యామేజ్ కంట్రోల్) కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. శుక్రవారం రాత్రి విడుదల చేసిన పత్రికా ప్రకటన తన తప్పుల్ని కప్పిపుచ్చుకోవడానికి చేసిన వృథా ప్రయత్నం అని స్పష్టం చేసింది. పాక్షికంగా చేసే దిద్దుబాటు చర్యల వల్ల లక్షలాది మంది ఓటర్ల హక్కులను కాలరాస్తున్నారని ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరాం రమేశ్ విమర్శించారు. ఓటర్ల తొలగింపుపై ఈసీ అనుసరిస్తున్న విధానాలు పౌరుల ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం కలిగిస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల సంఘం ప్రతిపాదించిన చర్యలు– సర్ ప్రక్రియలో సమస్యలు ఉన్నాయనే విషయాన్ని పరోక్షంగా అంగీకరించినట్లేనని ఆయన అన్నారు. కొద్ది మంది ఓటర్లకు ఉపశమనం కలిగించేలా తీసుకుంటున్న చర్యలు– భారీ స్థాయిలో జరిగిన ఓటర్ల తొలగింపును సరిచేయలేవని వ్యాఖ్యానించారు.ఎన్నికల కమిషన్ జారీ చేసిన క్లారిఫికేషన్‌ను తోసిపుచ్చుతూ జైరాం రమేశ్ పలు అంశాల్ని లేవనెత్తారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ముప్పులో ఉన్న 5.43 కోట్ల మంది ఓటర్ల ఇళ్లకు బూత్ లెవెల్ అధికారులు (ఃఒూ) వెళ్తారని ఎన్నికల సంఘం చెప్పడం విడ్డూరంగా ఉందని, మొదటి దశలోనే నిబంధనలు సరిగ్గా అమలు కాలేదని, అప్పుడే సరిగా జరగని ఇళ్ల సర్వేను మళ్లీ చేస్తామనడంలో అర్థమే లేదని విమర్శించారుజ్ఞానేశ్ కుమార్ నేతృత్వం లోని ఎన్నికల కమిషన్ 'సర్' ప్రక్రియ ద్వారా ముసాయిదా ఓటర్ల జాబితాలనుంచి 13కోట్లకు పైగా పేర్లను తొలగించింది.స్వయంగా అర్హులైన ఓటర్లను నమోదు చేయాల్సిన ప్రభుత్వ బాధ్యతను ఓటర్లపైనే మోపుతున్నారన్న విమర్శలు వచ్చాయి అంటే పేర్లను ముందుగా తొలగించి, తరువాత వాటిని ధ్రువీకరించే విధానం అమలైంది. తిరిగి ఓటర్ల జాబితాలో పేరు చేర్చుకోవడానికి ఓటర్లపై కఠినమైన, భారమైన నిబంధనలు విధిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా (సర్) రాజ్యాంగబద్ధమైనదా కాదా అనే విషయంపై సుప్రీం కోర్టు నెలల తరబడి నిర్ణయం తీసుకోకపోవడంతో కొన్ని లోపాలు చోటుచేసుకున్నాయి. చివరకు మే 27న కోర్టు తీర్పు ఇచ్చే సమయానికి బీహార్, పశ్చిమబెంగాల్, రెండో దశలోఉన్న ఇతర రాష్ట్రాల్లో 'సర్' ప్రక్రియ అప్పటికే ప్రారంభమై, వాస్తవ పరిస్థితిని మార్చేసింది. సుప్రీం కోర్టు తీర్పు ఎడిఎం జబల్‌పూర్ కేసులో ప్రభుత్వం పట్ల కోర్టు చూపిన విధేయతను గుర్తు చేసేలా ఉందన్న విమర్శలు తలెత్తాయి. 'సర్'ను ఆచరణలో ఎలా అమలు చేశారన్న దానికంటే సిద్ధాంతపరంగా ఎలా ఉండాలో కోర్టు చూసింది. అసాధారణమైన, నిర్దిష్టమైన సందర్భాల్లో మాత్రమే చేయాల్సిన ఓటర్ల జాబితా సవరణ నిబంధనను, రాష్ట్రవ్యాప్తంగా భారీస్థాయిలో సవరణ చేయడానికి అనుమతిగా భావించారు. ఇప్పటికే ఓటర్ల జాబితాలో ఉన్నవారు అర్హులేనని నిరూపించాల్సిన అవసరం లేదని చెప్పినప్పటికీ, సర్ ద్వారా వారు మళ్లీ తమ అర్హతను నిరూపించుకోవలసి వచ్చింది. అలాగే 1995 నాటి సుప్రీం కోర్టు తీర్పులో ఓటర్ల జాబితాలో ఎవరి పేరునైనా తొలగించడానికి వ్యక్తిగత కారణం ఉండాలని వెల్లడించిన విషయాన్ని కూడా ఇప్పటి సుప్రీం కోర్టు తీర్పు పక్కన పెట్టిందని విమర్శలు వస్తున్నాయి. పశ్చిమబెంగాల్ లోని ట్రైబ్యునల్ తీర్పు ఇచ్చిన అప్పీళ్లలో 90 శాతానికి పైగా, అసెంబ్లీ ఎన్నికలు జరిగిన కొన్ని నెలల తర్వాత తొలగించబడిన ఓటర్లను మళ్లీ ఓటర్ల జాబితాలో చేర్చారు. ఢిల్లీ లోని మూడోవంతు నియోజకవర్గాల్లో, ముసాయిదా ఓటర్ల జాబితాలో ఉన్న ఓటర్ల సంఖ్య 2025లో వాస్తవంగా ఓటు వేసిన వారికంటే తక్కువగా ఉంది. ఢిల్లీలో ఆగస్టు 31న విడుదలైన ముసాయిదా ఓటర్ల జాబితాలో 97.5లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 31.6 లక్షల మందికి రెండు కారణాల కింద నోటీసులు జారీ చేశారు. ఒకటి ఓటరు వివరాలను సంబంధిత పాత రికార్డులతో సరిపోల్చలేకపోవడం, రెండోది తార్కిక వ్యత్యాసాలు. రెండోది.. ఓటరు వివరాల్లో కొన్ని అసంగతలు ఉండడం. దీంతో 31.6లక్షల మంది ఓటర్లు ఇఆర్ఒ, ఎఇఆర్ఒ కార్యాలయాలకు స్వయంగా వెళ్లాల్సి వస్తుందేమో అన్న ఆందోళన ఏర్పడింది. అయితే ఇప్పుడు ఎన్నికల కమిషన్ వెల్లడించిన వివరాల ప్రకారం బూత్‌లెవెల్ అధికారులు (బిఎల్ఒ) ఓటర్ల ఇళ్లకే వెళ్లి వివరాలను పరిశీలిస్తారు. అత్యవసరమైన, ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావలసి ఉంటుంది. అంటే పౌరుడు ఇబ్బందులు పడుతూ అధికారులను సంప్రదించాల్సిన పరిస్థితి లేకుండా సంస్థే పౌరుడు దగ్గరకు వెళ్లే విధానం అమలవుతుంది.అయితే ఈ పనిని కేవలం 14,000 మంది బూత్ లెవెల్ అధికారులు ఎలా నిర్వహిస్తారనేది ఆందోళన కలిగించే విషయం. రాత్రుళ్లు షెల్టర్లలో నివసించే వారు, కూలీలు, పేదలు, నిరాశ్రయులు, మొదలైన వారి వివరాల నమోదు కోసం తగిన హెల్ప్ డెస్కులు, ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామని ఎన్నికల కమిషన్ చెబుతోంది. మరి ఇది ఎలా అమలవుతుందో చూడాలి. మరో ముఖ్యమైన ఓటరు సమస్య ఫారం 6. ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునే ప్రతి పెద్దవారు ఈ ఫారమ్‌ను నింపాలి. ఆన్‌లైన ఫారమ్ 6 లో కొత్త ఓటర్లు తమ తల్లిదండ్రులు, లేదా తాతయ్య, అమ్మమ్మలు చివరి 'సర్'కు సంబంధించిన ఓటర్ల జాబితాలో ఉన్నారా? అన్నది ప్రకటించాలి. అయితే కొత్త ఓటర్లు ఎలాంటి డిక్లరేషన్ ఇవ్వకుండానే ఫారమ్ 6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. అయితే 'సర్' ప్రక్రియలో ఇలాంటి నిబంధన ఉండకూడదన్న వాదన వస్తోంది. శనివారం ఎన్నికల సంఘం విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో పెద్దగా మార్పేమీ కనిపించడం లేదు. ప్రభుత్వ ఆధిపత్యం చెలాయించలేని విధంగా ఉండే ఎంపిక కమిటీ ద్వారా ఎన్నికల కమిషన్‌ను పునర్వ్యవస్థీకరించాలి.

# పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన "ఆపరేషన్ త్రిశూల్" ప్రదర్శన స్టాల్ను పరిశీలించిన సీఎం చంద్రబాబు




బాపట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపల్లె పర్యటనలో భాగంగా ప్రజా వేదిక వద్ద బాపట్ల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "ఆపరేషన్ త్రిశూల్" ప్రదర్శన స్టాల్ను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ జిల్లాలో నేర నియంత్రణ, గంజాయి, డ్రగ్స్ నిర్మూలన, మహిళలు, బాలికల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ చేపడుతున్న వివిధ చర్యలు, వాటి ద్వారా సాధించిన ఫలితాలను ముఖ్యమంత్రి కి వివరించారు.

జిల్లాలో గంజాయి డ్రగ్స్ రహిత వాతావరణం కల్పించడమే లక్ష్యంగా "ఆపరేషన్ త్రిశూల్" ద్వారా విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టామని ఎస్పీ తెలిపారు. యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు జిల్లావ్యాప్తంగా 661 ఈగిల్ క్లబ్లను ఏర్పాటు చేసి 5,334 అవగాహన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. 19 కేసులలో 287 కిలోల గంజాయి సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలు వినియోగానికి పాల్పడే వారిపై నిఘా ఉంచామన్నారు. 1,467 మంది పాత నేరస్థుల పై నిరంతర నిఘా ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వారి కార్యకలాపాలను పర్యవేక్షించడం జరుగుతుందని, మరో 7,012 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ ను, వాటిని సేవించిన వారిని పరీక్షించేందుకు నూతనంగా జిల్లాకు కేటాయించబడిన గంజాయి టెస్ట్ కిట్స్ పనితీరును గురించి ముఖ్యమంత్రి కి వివరించారు.

మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పోలీస్ శాఖ చేపట్టిన చర్యల ఫలితంగా జిల్లాలో మహిళ సంబంధిత నేరాలు 22.55 శాతం, అత్యాచారా కేసులు 25 శాతం, పోక్సో కేసులు 50 శాతం మేర తగ్గాయని తెలిపారు. జిల్లాలో మహిళలు, బాలికల్లో భద్రతపై అవగాహన కల్పించేందుకు 4 శక్తి బృందాల ఆధ్వర్యంలో 3,649 అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు 1,35,475 మంది మహిళలు వారి మొబైల్ ఫోన్ లలో శక్తి యాప్పు డౌన్లోడ్ చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించడం జరిగిందన్నారు.

జిల్లా పోలీస్ శాఖ పనితీరు పట్ల ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ ని ప్రత్యేకంగా అభినందించి ఇదే విధానాన్ని కొనసాగించాలని తెలిపారు

# నర్సింగ్ విద్యార్థిని హరిణి హత్య కేసును ఛేదించిన జూలూరుపాడు పోలీసులు

### ప్రేమించలేదనే ఉన్మాదం
### సీతారామ ప్రాజెక్టు కాల్వ వద్ద నిందితుడు పవన్ అరెస్ట్
### కేసు వివరాలు వెల్లడించిన కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ

జూలూరుపాడు, అక్టోబర్ 01 : ప్రేమను నిరాకరించిందన్న కోపంతో ఓ ఉన్మాది రెచ్చిపోయాడు. ఎనిమిదేళ్లుగా వెంటతిరిగిన యువతి తనను దూరం పెడుతోందని కక్ష పెంచుకున్నాడు. ఏకంగా బైక్ గేర్ వైరుతో గొంతు బిగించి కిరాతకంగా హతమార్చాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం వెంగన్నపాలెంలో సంచలనం సృష్టించిన బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని ఇంద్రవెల్లి హరిణి (18) హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జూలూరుపాడు పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ వెల్లడించారు.

వెంగన్నపాలెం గ్రామానికి చెందిన సతీష్, రాజేశ్వరి దంపతుల కుమార్తె హరిణి, నిందితుడు దేవరకొండ పవన్ కుమార్ గత కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పవన్ కుమార్ ఎలాంటి పని చేయకుండా మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతుండడంతో హరిణి ఇటీవల అతడిని దూరం పెట్టింది. ఈ క్రమంలో ఏడాది క్రితం ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో పంచాయతీ సైతం జరిగింది. పవన్ కుమార్ ప్రవర్తన సరిగా లేనందున తమ కూతురు హరిణిని ఇచ్చి పెళ్లి చేయలేమని ఆమె కుటుంబ సభ్యులు తేల్చిచెప్పారు. అయినా పవన్ తీరు మారలేదు. తరచూ ఆమె వెంటపడుతూ వేధింపులకు గురిచేయడం మొదలుపెట్టాడు. దీంతో విసిగిపోయిన హరిణి, అతడి ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేయడంతో పాటు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను సైతం మార్చేసింది. తనను పూర్తిగా దూరం పెడుతోందన్న అక్కసుతో పవన్ కుమార్ దారుణానికి ఒడిగట్టాడు. సెప్టెంబర్ 22న మధ్యాహ్నం సమయంలో వెంగన్నపాలెంలోని హరిణి ఇంటికి వెళ్లాడు. అప్పటికే ఇంట్లో ఉన్న ఆమెతో వాగ్వాదానికి దిగాడు. తనను ఎందుకు కాదంటున్నావని నిలదీశాడు.

ఆమె ఎంతకీ అంగీకరించకపోవడంతో ఆవేశానికి గురైన పవన్ తన వెంట తెచ్చుకున్న బైక్ గేర్ వైరుతో హరిణి మెడకు గట్టిగా బిగించి దారుణంగా హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ఇంటి పక్కన ఉన్న మెట్ల పక్కన సందులో పడేసి అక్కడి నుండి పరారయ్యాడు. ?పోస్టుమార్టం రిపోర్టుతో వెలుగులోకి: కూతురు విగతజీవిగా పడి ఉండడాన్ని చూసిన తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు జూలూరుపాడు పోలీసులు



అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే పోస్టుమార్టం నివేదికలో యువతి మెడకు వైరు లాంటిది బిగించి చంపినట్లు వైద్యులు నిర్ధారించడంతో పోలీసులు దీనిని హత్య కేసుగా మార్చి దర్యాప్తు వేగవంతం చేశారు. ?బైక్ కోసం వచ్చి పోలీసులకు చిక్కిన నిందితుడునిందితుడు పవన్ కుమార్ తన గ్లామర్ బైక్‌ను ఒంటిటిగుడిసె రోడ్డులోని సీతారామ ప్రాజెక్టు కాల్వ వద్ద ఎవరికీ కనిపించకుండా దాచిపెట్టాడు. అక్కడి నుండి నేరుగా విశాఖపట్నం పారిపోయాడు. ఆ తర్వాత తిరుపతి వెళ్లి, అక్కడినుంచి తిరిగి ఖమ్మం చేరుకున్నాడు. వేరే ప్రాంతానికి వెళ్లి రాపిడో నడుపుకుంటూ బతుకుదామన్న ఉద్దేశంతో, తాను దాచిపెట్టిన బైక్ తీసుకునేందుకు జూలూరుపాడు వచ్చాడు. పక్కా సమాచారంతో నిఘా పెట్టిన పోలీసులు, ప్రాజెక్ట్ కాల్వ వద్ద బైక్ తీసుకునేందుకు వచ్చిన నిందితుడు పవన్‌ను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు, అతడి నుండి హత్యకు ఉపయోగించిన బైక్ గేర్ వైర్, ఒక గ్లామర్ బైక్, రెండు మొబైల్ ఫోన్లు, హత్య సమయంలో నిందితుడు ధరించిన షర్ట్‌ను సీజ్ చేశారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన జూలూరుపాడు పోలీసు సిబ్బందిని డీఎస్పీ ఆదినారాయణ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో సిఐ శ్రీలక్ష్మి, ఎస్ఐ జీనత్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

# అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం 2026 కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు



హైదరాబాద్ లో గురువారం జరిగిన అంతర్జాతయ వయో వృద్ధుల దినోత్సవంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్, ఎస్సీ సంక్షేమ శాఖ సెక్రెటరీ విజయేంద్ర బోయి, ఇతర అధికారులు పాల్గోన్నారు. వయో వృద్ధుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న పలు సంస్థలకు అవార్డులు ప్రదానం చేసారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ వయోవృద్ధులు కాదు నవ సమాజ నిర్మితులు. వయోవృద్ధుల అనుభవం, ఆలోచనలు సమాజ అభివృద్ధికి ఎంతో కీలకం. వయోవృద్ధులను సమాజానికి మార్గదర్శకులుగా, బ్రాండ్ అంబాసిడర్లుగా గౌరవించాలని అన్నారు. తల్లిదండ్రులకు సేవ చేసుకోవడం పూర్వజన్మ సుకృతం. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు వయోవృద్ధ తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వయోవృద్ధుల రక్షణ, గౌరవం, సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుంది. అవసరమైతే చట్టాల్లో నిబంధనలు మార్చి అయినా వయోవృద్ధులకు రక్షణ కల్పిస్తాం. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన ప్రభుత్వం సంక్షేమం, సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇస్తోంది. వయోవృద్ధులకు సీనియర్ సిటిజన్ బస్ పాస్లు ఇవ్వాలన్న డిమాండ్ను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఆర్టీసీని తిరిగి గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు రూ.1,000 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయి. రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల బకాయిల పరిష్కారంపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చించాం. త్వరలోనే రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపులకు కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు.మీ సమస్యలు ఎప్పుడైనా చెప్పుకోండి ప్రభుత్వం పరిష్కారం చేస్తుంది. వయోవృద్ధుల అనుభవం కుటుంబ అభివృద్ధికి, ప్రభుత్వ అభివృద్ధికి ఉపయోగపడాలని అన్నారు.

# ఆయిల్ ఫామ్ తోటల సందర్శన.

రుద్రవరం మండలం డి.కొట్టాల గ్రామానికి చెందిన 20 మంది రైతులునంద్యాల జోన్ తరఫున పశ్చిమ గోదావరి జిల్లా ఏర్నగూడెంలోని ఆయిల్‌పామ్ దిగుబడి తోటలను మరియు 3 ఎఫ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని సందర్శించారు. 3 ఎఫ్ ఆయిల్ ఫామ్ ప్రవేట్ లిమిటెడ్ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రైతు క్షేత్ర సందర్శనలో రైతులు అధిక దిగుబడినిస్తున్న ఆయిల్‌పామ్ తోటలను ప్రత్యక్షంగా పరిశీలించారు. తోటల నిర్వహణ, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, కోత విధానం తదితర సాగు మెళకువలను రైతులు తెలుసుకున్నారు.అనంతరం రైతులు ఏర్నగూడెంలోని 3 ఎఫ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని సందర్శించారు. ఫ్యాక్టరీలో పండ్ల గెలల సేకరణ, తూకం, గ్రేడింగ్, ప్రాసెసింగ్, నూనె తీత మరియు రైతులకు చెల్లింపుల విధానం గురించి క్షుణ్ణంగా వివరించారు. కంపెనీ అందిస్తున్న మార్కెటింగ్ సౌకర్యం మరియు గిట్టుబాటు ధరపై రైతులకు పూర్తి భరోసా కల్పించారు.ఈ సందర్శన రైతులలో ఆయిల్‌పామ్ సాగుపై మరింత అవగాహన, నమ్మకాన్ని పెంచిందని, త్వరలోనే సాగు చేపట్టేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో 3 ఎఫ్ ఆయిల్ ఫామ్ ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ జనరల్ మేనేజర్ విజయ్ ప్రసాద్ , జోనల్ మేనేజర్ షేక్ ఫిరోజ్ బాషా, ఉద్యానవన శాఖ అధికారి దస్తగిరి , క్లస్టర్ మేనేజర్ షేక్ నాసర్ మహమ్మద్, అసిస్టెంట్ మేనేజర్,బి. గోపాల్ పాల్గొన్నారు.

## అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి.

# జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి.

ప్రొద్దుటూరు,అక్టోబర్ 1 జలజీవన్ మిషన్ ప్రాజెక్టుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 5వ తేదీన ప్రొద్దుటూరుకు రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, అధికారులను ఆదేశించారు. గురువారం ప్రొద్దుటూరులోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శాసన సభ్యులు నంద్యాల వరదరాజుల రెడ్డి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా తదితరులతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి సభా ప్రాంగణం, వేదిక, బారికేడింగ్, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, భద్రత తదితర ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకలు, పార్కింగ్ ప్రాంతాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

శాసన సభ్యులు నంద్యాల వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు తొలిసారిగా ప్రొద్దుటూరు కు వస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి గారి పర్యటనను విజయవంతం అయ్యేలా అధికారులు పని చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రి గారి పర్యటన ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టేలా ఏ శాఖకు కేటాయించిన విధులు ఆ శాఖ అధికారులు ఎక్కడా పొరపాట్లకు తావివ్వకుండా పూర్తి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఎపి షేక్స్ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వి ఎస్ ముక్తియార్, ప్రొద్దుటూరు ఏఎస్పి కృష్ణ, జమ్మలమడుగు, కడప, బద్వేల్, పులివెందుల ఆర్డీఓ లు శిరీష, చంద్రశేఖర్, చిన్నయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్ ఇర్విన్, డిఆర్డిఎ పిడి రాజ్యలక్ష్మి, ఆర్డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి,ఎస్ పిడిసిఎల్, ఎస్ఈ లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. తొలుత జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి, శాసన సభ్యులు ఎన్ వరదరాజుల రెడ్డి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ డా నిధి మీనా, జిల్లా అధికారులతో కలిసి బహిరంగ సభ ప్రదేశం, హెలిప్యాడ్ ప్రదేశాలను పరిశీలించి అధికారులకు తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

## అంగన్వాడీ టీచర్ బండారి ఉమా మహేశ్వరి దశదిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుల నివాళులు



కురవి మండల కేంద్రానికి చెందిన బండారి రమేష్ సతీమణి, అంగన్వాడీ టీచర్ బండారి ఉమా మహేశ్వరి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో కురవి మండల కేంద్రంలోని వీరభద్ర ఏసీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆమె దశదిన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై నివాళులర్పించారు.ఈ సందర్భంగా మహేశ్వరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కురవి మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాలగాని శ్రీనివాస్ గౌడ్, కురవి టౌన్ అధ్యక్షులు నారాయణ రాజేంద్రకుమార్, సమన్వయ కమిటీ అధ్యక్షులు, మాజీ మండల అధ్యక్షులు అంబటి వీరభద్ర గౌడ్, మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్, కురవి ఆలయ చైర్మన్ కొర్ని రవీందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి, మండల ఉపాధ్యక్షులు అవిరే మోహన్ రావు, బానోత్ తుకారం నాయక్, ఆలయ ధర్మకర్త సక్రు నాయక్, నేరడ సర్పంచ్ గౌతమి వెంకన్న, గ్రామ అధ్యక్షులు బానోతు లాల నాయక్, బాదావత్ రామకృష్ణ, రాములు వెంకన్న, కురవి మాజీ వార్డు సభ్యులు బానోతు లక్ష్మణ్ నాయక్, బీఎల్ఏ కురవి నాగరాజు, కాంగ్రెస్ నాయకులు బాలాజీ, రాములు, గుగులోతు బాలాజీ, దెబ్బేటి వెంకటయ్య, రామ్మూర్తి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మమతా వర్గానికి సుప్రీంలో చుక్కెదురు...

**రూ.804 కోట్ల ఖాతాలపై పిటిషన్ కొట్టివేత**
**స్తంభింపజేసిన టీఎంసీ ఖాతాలపై మమతా వర్గం పిటిషన్ కొట్టివేత**
**నాలుగు బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ. 804 కోట్ల నిధులపై విచారణ**
**హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు**
**పార్టీలో వర్గపోరు తేలేవరకు నిధులపై నిర్ణయం కష్టమన్న ధర్మాసనం**
**కేసు విచారణను వేగవంతం చేయాలని కలకత్తా హైకోర్టుకు సూచన**



పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ వర్గానికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. స్తంభింపజేసిన నాలుగు బ్యాంకు ఖాతాలను వినియోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం తోసిపుచ్చింది. ఈ ఖాతాల్లో సుమారు రూ. 804 కోట్ల మేర నిధులు ఉన్నట్లు సమాచారం. జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ పి.బి. వరాలేలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. కలకత్తా హైకోర్టు గతంలో జారీ చేసిన ఉత్తర్వులలో జోక్యం చేసుకునేందుకు ధర్మాసనం నిరాకరించింది. పార్టీలో నెలకొన్న వర్గపోరు కారణంగా కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే పార్టీ గుర్తును స్తంభింపజేసిందని, ఈ నేపథ్యంలో సదరు నిధులు యాజమాన్య హక్కులపై స్పష్టత రావాల్సి ఉందని కోర్టు అభిప్రాయపడింది. ఈ దశలో నిధుల వినియోగంపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేమని స్పష్టం చేస్తూ, కేసు విచారణను వేగవంతం చేయాలని కలకత్తా హైకోర్టును ఆదేశించింది. ఆర్థిక అవకతవకల ఆరోపణలు, పలు ఎఫ్ఐఆర్‌ల నమోదు నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ పోలీసులు ఈ నాలుగు ఖాతాలను స్తంభింపజేశారు. దీనిపై మమతా వర్గం కలకత్తా హైకోర్టును ఆశ్రయించగా, ఆగస్టు 27న వారికి ఎటువంటి మధ్యంతర ఊరట లభించలేదు. అయితే, రోజువారీ పార్టీ నిర్వహణ ఖర్చుల కోసం కోర్టు నియమించిన ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో ఇతర ఖాతాలను పరిమితంగా వినియోగించుకోవడానికి హైకోర్టు అనుమతినిచ్చింది. ఖాతాల స్తంభనతో పార్టీ కార్యకలాపాలు నిలిచిపోతున్నాయని మమతా వర్గం వాదించినప్పటికీ, సుప్రీంకోర్టు మాత్రం హైకోర్టు నిర్ణయాన్నే సమర్థించింది.

# రబీలో మెట్ట పంటల సాగుపై కిసాన్ గోష్టి

## తక్కువ నీటితో మెట్ట పంటలు సాగు చేసుకోవాలి : వ్యవసాయ అధికారులు



ఆత్మకూరు: ఎల్‌నినో ప్రభావంతో రబీ సీజన్‌లో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ నీటితో సాగు చేసే మెట్ట పంటలను ఎంచుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ చెన్నయ్య సూచించారు. రబీ సీజన్‌లో పంటల ఎంపిక, సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు కిసాన్ గోష్టి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నంద్యాల వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త మోహన్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితుల్లో వివిధ పంటల్లో పాటించాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు. శాస్త్రవేత్త అరుణ్ కుమార్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవడం ద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించడంతో పాటు పంట నష్టాలను నివారించవచ్చని తెలిపారు.తక్కువ నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో వరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా మినుము, శనగ, జొన్న, వేరుసెనగ, కుసుమ తదితర మెట్ట పంటలను సాగు చేయాలని సూచించారు. విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, సరైన సమయంలో విత్తడం, ఎరువుల వినియోగం, కలుపు నివారణ వంటి అంశాల్లో శాస్త్రీయ పద్ధతులను పాటించాలని తెలిపారు.వర్షపు నీటిని పొలాల్లో నిల్వ చేసుకునేందుకు పంట అవశేషాలు, చిన్న నీటి కుంటలు, పొలాల చుట్టూ కాలువలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు సూచించారు. అంతర పంటలు సాగు చేయడం, పంట అవశేషాలను నేలపై ఉంచడం, అవసరానికి అనుగుణంగా తక్కువ దున్నే పద్ధతులను అవలంబించడం ద్వారా పంటలకు మేలు జరుగుతుందని తెలిపారు.రైతులు నాణ్యమైన ధ్రువీకరించిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసి తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. చీడపీడలను తొలి దశలోనే గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని, రసాయన మందులను విచక్షణారహితంగా వినియోగించకుండా వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సరైన మోతాదులోనే వినియోగించాలని తెలిపారు.రాయితీపై విత్తనాలు అందుబాటులో ఉన్నాయిఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కే. హేమలత మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలో భాగంగా రైతులకు రాయితీపై మినుము, కంది, కొర్ర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నాలుగు కిలోల విత్తనాల ప్యాకెట్ రూ. 103.50కు, శనగ విత్తనాలు 35 శాతం రాయితీపై కిలో రూ. 58.50కు అందుబాటులో ఉన్నాయని వివరించారు.జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో స్వల్పకాలిక రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. వెలుగోడు మండల వ్యవసాయ అధికారి స్వాతి మాట్లాడుతూ ఇప్పటివరకు పంటలు వేయని రైతులు తక్కువ నీటిని వినియోగించే, తక్కువ కాల వ్యవధి కలిగిన పంటలను ఎంచుకోవాలని తెలిపారు. నీటి వసతి ఉండి బెట్ట పరిస్థితులు ఏర్పడినప్పుడు ఆరు సాళ్లకు ఒక లోతు సాలు ఏర్పాటు చేయాలని, లేదా ఒక సాలు విడిచి ఒక సాలు సాగు చేయడం ద్వారా పంటలను కొంతమేర కాపాడుకోవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూరు, పాములపాడు, వెలుగోడు, కొత్తపల్లి మండలాల వ్యవసాయ శాఖ సిబ్బంది, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## కావలిలో 'సేవా సంకల్ప్ యాత్ర'కు ఘన స్వాగతం

**స్వయంగా బైక్ నడిపి యువతలో జోష్ నింపిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి**
**తిరుపతి నుంచి కాశీ వరకు ప్రతిష్టాత్మక మోటార్ సైకిల్ ర్యాలీ**
**మోదీ 25 ఏళ్ల ప్రజాపాలన స్ఫూర్తితో యాత్ర: కావలి ఎమ్మెల్యే**



కావలి, అక్టోబర్ 01 దేశ ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 సంవత్సరాల సుదీర్ఘ ప్రజాప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా తిరుపతి నుంచి వారణాసి (కాశీ) వరకు చేపట్టిన ప్రతిష్టాత్మక "సేవా సంకల్ప్ యాత్ర" బైక్ ర్యాలీ గురువారం కావలి పట్టణానికి చేరుకుంది. ఈ యాత్రకు కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కూటమి నాయకులు, టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.పట్టణంలోని ఎస్ఎంకె కళ్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, జెండా ఊపి బైక్ ర్యాలీని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా బైక్ నడుపుతూ ర్యాలీలో పాల్గొని కార్యకర్తలలో, యువతలో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ.పవిత్ర తిరుపతి అలిపిరి పాదాల చెంత ప్రారంభమైన ఈ యాత్రలో తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఒఔఈ), కూటమికి చెందిన 25 మంది ప్రతినిధులు బైకర్లుగా ఎంతో అంకితభావంతో పాల్గొంటున్నారని కొనియాడారు. ఈ యాత్ర అక్టోబర్ 8 నాటికి కాశీకి చేరుకుంటుందని తెలిపారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్ అందిస్తున్న సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, మోదీ 25 ఏళ్ల నిస్వార్థ ప్రజాసేవను చాటిచెప్పడమే ఈ యాత్ర ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కావలి పట్టణ టీడీపీ కమిటీ నాయకులు, ఒఔఈ ప్రతినిధులు, కూటమి ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్రకు సంపూర్ణ మద్దతు తెలిపారు.

## అక్టోబర్ 31 నాటికి వెయ్యి కిలోల వర్మీ కంపోస్ట్ సిద్ధం చేయాలి




కొత్తపల్లి: కొత్తపల్లి మండలం గువ్వలకుంట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ (ాచిఖఅ)ను ఓఖఆా, డిప్యూటీ ఓఖఆా అధికారులు సందర్శించి అక్కడి నిర్వహణ, వర్మీ కంపోస్ట్ తయారీ ఏర్పాట్లను పరిశీలించారు.వర్మీ కంపోస్ట్ తయారీ కోసం అవసరమైన ఔంఆఇఖ కంపోస్ట్‌ను ఇప్పటికే సిద్ధంగా ఉంచినట్లు అధికారులు గుర్తించారు. త్వరగా వానపాములను తీసుకువచ్చి సిద్ధంగా ఉన్న కంపోస్ట్‌లో వదిలి వర్మీ కంపోస్ట్ తయారీ ప్రక్రియను ప్రారంభించాలని సంబంధిత ఖఆాకు సూచించారు.అక్టోబర్ 31వ తేదీ నాటికి 1000 కిలోల వర్మీ కంపోస్ట్‌ను సిద్ధం చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. గ్రామాల్లో సేకరించే సేంద్రియ వ్యర్థాలను సద్వినియోగం చేసుకుంటూ నాణ్యమైన సేంద్రియ ఎరువును తయారు చేయాలని సూచించారు.ాచిఖఅ ద్వారా వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచడంతో పాటు వర్మీ కంపోస్ట్ తయారీని ప్రోత్సహించాలని అధికారులు తెలిపారు. వర్మీ కంపోస్ట్ తయారీ లక్ష్యాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

# పదోసారి ఎన్నికలకు దానం...

హైదరాబాద్, అక్టోబరు 1, ఖైరతాబాద్? నియోజకవర్గానికి బై ఎలక్షన్ (ఉపఎన్నిక)? అనివార్యం కానుంది. శాసనసభ్యుడు దానం నాగేందర్?పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు తీర్పు వెల్లడించిన విషయం తెలిసిందే. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పుపై తాను సుప్రీంకోర్టును ఆశ్రయించబోనంటూ ఆయన స్వయంగా ప్రకటించారు. దీంతో ఆరు నెలల్లోపు బై ఎలక్షన్? నిర్వహించనున్నారు.నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో హైకోర్టు తీర్పు కారణంగా దానంకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆయన ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కోర్టు తీర్పు అనంతరం దానం నాగేందర్ ఈ పరిస్థితిని చాలా చాకచక్యంగా ఎదుర్కొన్నారు. ఖైరతాబాద్‌కు బై ఎలక్షన్? వస్తే తానే బరిలో ఉంటానంటూ చెప్పారు. 2023లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్, 2024 మార్చిలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొన్నారు. అనంతరం సికింద్రాబాద్ లోక్?సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. హస్తం పార్టీలో చేరిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్? శాసనసభ్యులు స్పీకర్‌ను రెండేళ్ల క్రితమే కోరిన విషయం తెలిసిందే.ఎంపీగా పోటీ చేసినప్పుడు కాంగ్రెస్ పార్టీ బీ–ఫారం ఇచ్చినందువల్ల అనర్హత వేటు పడుతుందని దానం నాగేందర్ అనుకున్నారు. కోర్టు అనర్హత వేటు వేసినప్పటికీ అందుకు సిద్ధంగా ఉండాలన్న వ్యూహంతోనే ఆయన గుంభనంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. ఖైరతాబాద్‌కు ఒకవేళ బై ఎలక్షన్ వస్తే దానం నాగేందర్ పోటీ చేస్తే ఆయన శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయడం ఇది పదోసారి అవుతుంది.దానంపై అనర్హత వేటు పడటంతో తెలంగాణ భవన్ వద్ద భారతీయ రాష్ట్ర సమితి(బీఆర్ఎస్?) నేతలు శుక్రవారం సంబురాలు చేసుకున్నారు. తమ పోరాటం ఫలించిందని, ఫిరాయింపులను ప్రోత్సహించిన కాంగ్రెస్ రాజకీయాలకు ఇది చెంపపెట్టు అని ఖైరతాబాద్ బీఆర్ఎస్? ఇన్‌ఛార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి అన్నారు.దానం నాగేందర్‌పై అనర్హత వేటు ప్రజాస్వామ్య విజయమని బీజేపీ తెలంగాణ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఓటర్ల నమ్మకాన్ని కాదంటే తగిన ఫలితం ఎదురవుతుందని వివరించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం కోసం చేసిన పోరాటం ఫలించింది అని రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.దానం నాగేందర్?పై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్?ఎస్? శాసనసభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లను స్పీకర్ కొట్టివేసిన విషయం తెలిందే. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ వీరిద్దరూ హైకోర్టును ఆశ్రయించగా, దానంపై హైకోర్టు శుక్రవారం అనర్హత వేటు వేసింది. ఈ మేరకు దానంపై దాఖలైన అనర్హత పిటిషన్లను కొట్టివేస్తూ స్పీకర్ వెలువరించిన తీర్పులను రద్దు చేస్తూ హైకోర్టు 91 పేజీల తీర్పు వెలువరించింది. స్పీకర్ తీర్పును రద్దు చేయాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి?, బీజేపీ దాఖలు చేసిన పిటిషన్లను అనుమతించింది. 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచి అనర్హత అమల్లోకి వచ్చినట్లు పేర్కొంది.బీఆర్?ఎస్? సభ్యుడిగా ఉంటూ కాంగ్రెస్ అభ్యర్థిగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసినందున రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తున్నట్లు పేర్కొంది. దానంపై అనర్హత నేపథ్యంలో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉన్నట్లు పరిగణనలోకి తీసుకోవాలంది. ఈ ఉత్తర్వుల కాపీని స్పీకర్ సెక్రటరీకి, ఎన్నికల సంఘానికి పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

# ఢిల్లీలో ఏఐ ట్రాకింగ్ ట్రాఫిక్

న్యూఢిల్లీ, అక్టోబరు 1, ల్లీలో ట్రాఫిక్ నిర్వహణను సమర్థవంతంగా మార్చేందుకు కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. రూ.1,789.52 కోట్ల అంచనా వ్యయంతో ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్ట్‌ను ఢిల్లీ పోలీసులు అమలు చేయనున్నారు. ఢిల్లీలోని 42 ప్రధాన ట్రాఫిక్ కారిడార్లను మూడు దశల్లో 24 నెలల్లోగా ఎటూ పరిధిలోకి తీసుకురానున్నారు. ఆ తర్వాత ఐదేళ్లపాటు ఆపరేషన్, మెయింటెనెన్స్ కొనసాగనుంది.ఈ వ్యవస్థలో ఏఐ ఆధారిత అడాప్టివ్ ట్రాఫిక్ సిగ్నల్స్, రియల్‌టైమ్ ట్రాఫిక్ సమాచారం, ఆటోమేటెడ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవస్థలు అందుబాటులోకి రానున్నాయి. ట్రాఫిక్ పరిస్థితులకు అనుగుణంగా సిగ్నల్ టైమింగ్‌లు వాటంతట అవే మారుతాయి. మొదటి ఫేజ్‌లో ఏడాది కాలంలో 5 కారిడార్లలో 250 స్మార్ట్ సిగ్నల్స్, ప్రధాన కమాండ్ సెంటర్ ఏర్పాటవుతుంది. ఫేజ్ 2లో ఆరునెలల్లో 7 కారిడార్లలో 222 స్మార్ట్ సిగ్నల్స్, డిజాస్టర్ రికవరీ సెంటర్ ఏర్పాటవుతుంది. మూడో ఫేజ్‌లో ఆరునెలల్లో 30 కారిడార్లలో 620 స్మార్ట్ సిగ్నల్స్ ఏర్పాటు కానున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను కేంద్ర హోంశాఖ కార్యదర్శి, ఢిల్లీ పోలీస్ కమిషనర్, ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ కమిషనర్ నేతృత్వంలోని మూడు కమిటీలు పరిశీలిస్తాయి.అంబులెన్సులు, ఇతర అత్యవసర వాహనాలకు గ్రీన్ కారిడార్ సౌకర్యం కల్పించనున్నారు. ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదాలను రియల్‌టైమ్‌లో గుర్తించి వేగంగా స్పందించేలా వ్యవస్థను రూపొందించనున్నారు. రాంగ్ రూట్, స్పీడింగ్, రెడ్‌లైట్ జంపింగ్, హెల్మెట్, సీట్‌బెల్ట్ ఉల్లంఘనలు, ఇల్లీగల్ పార్కింగ్, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ వాడకం వంటి ఉల్లంఘనలను టెక్నాలజీ సాయంతో గుర్తించేలా ఉంటుంది. ఏఐ అనలిటిక్స్ ద్వారా దొంగిలించిన, బ్లాక్‌లిస్ట్ చేసిన వాహనాలు, రిపీట్ ఉల్లంఘనలు కూడా గుర్తించబడతాయి.వేరియబుల్ మెసేజ్ సైన్ బోర్డులు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కమ్యూటర్లకు రద్దీ, డైవర్షన్‌లు, పార్కింగ్ సమాచారం అందిస్తారు. ట్రాఫిక్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు, సెక్యూర్ డేటా సెంటర్‌తో కూడిన ఇంటిగ్రేటెడ్ వ్యవస్థ ఏర్పాటు కానుంది. దీనికి సీ–డ్యాక్ సాంకేతిక సహకారం అందిస్తుంది.ఢిల్లీలో సుమారు 71 లక్షల యాక్టివ్ రిజిస్టర్డ్ వాహనాలు ఉన్నాయి. రోడ్డు మౌలిక సదుపాయాల విస్తరణ కంటే వాహనాల పెరుగుదల ఎక్కువగా ఉండటంతో ఈ అధునాతన వ్యవస్థ ట్రాఫిక్ రద్దీని తగ్గించి, రోడ్ సేఫ్టీని గణనీయంగా మెరుగుపరచాలని ప్రభుత్వం భావిస్తోంది.

# నాని చేస్తున్నది సరైందేనా?!

హైదరాబాద్, అక్టోబరు 1, నాని ప్యారడైజ్ సినిమాకు రిలీజ్ తర్వాత నెగిటివ్ టాక్ వచ్చింది. రివ్యూల్లోనూ తక్కువ రేటింగ్స్ కనిపించాయి. సోషల్ మీడియాలో కూడా సినిమాపై నెగిటివిటీ కనిపించింది. అయితే సినిమాకు ఉన్న బజ్ కారణంగా మంచి ఓపెనింగ్స్ రావడంతో పాటు, మొదటి రెండు మూడు రోజుల్లో మంచి ఫుట్‌ఫాల్స్ కూడా కనిపించాయి.

నాని కూడా ప్రేక్షకుల అభిప్రాయాలను గౌరవిస్తూనే, సినిమాకు వస్తున్న ఫుట్‌ఫాల్స్ గురించి మాట్లాడాడు. రిలీజ్ తర్వాత ప్రెస్ మీట్‌లో ప్రేక్షకుల రెస్పాన్స్‌ను తీసుకున్నామని, మెల్లగా ఆడియన్స్ సినిమాను చూడటం మొదలుపెడుతున్నారని, ఆదరిస్తున్నారని చెప్పాడు.ఇదే సమయంలో నాని పోస్ట్–రిలీజ్ ప్రమోషన్స్‌ను కూడా కొనసాగిస్తున్నాడు. దర్శకుడితో ఇంటర్వ్యూ చేయడం, థియేటర్ విజిట్ చేయడం, డిస్ట్రిబ్యూటర్‌తో కలిసి సినిమా ఫుట్‌ఫాల్స్ గురించి మాట్లాడాడు. ఈ రోజు మేడారం వెళ్లారు. అయితే వీటిపైనా సోషల్ మీడియాలో ట్రోలింగ్ మొదలైంది. 'ఫ్లాప్ సినిమాకు ఇంత పబ్లిసిటీ ఎందుకు?' అనే కామెంట్స్ వస్తున్నాయి.కానీ ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. హిట్ సినిమాకు పెద్దగా ప్రమోషన్ అవసరం లేదు. ప్రేక్షకుల మౌత్ టాక్, హౌస్‌ఫుల్స్, సోషల్ మీడియా చర్చ.. ఇవే సినిమాను ముందుకు తీసుకెళ్తాయి. కానీ టాక్ మిశ్రమంగా ఉన్నప్పుడు లేదా నెగిటివ్‌గా ఉన్నప్పుడు సినిమాను థియేటర్లలో నిలబెట్టేందుకు మేకర్స్ చేసే ప్రయత్నమే పోస్ట్–రిలీజ్ ప్రమోషన్స్.'సినిమా బాలేదు' అని చెప్పి పక్కకు తప్పుకోవడం ఒక మార్గం. కానీ తన సినిమాను చివరి వరకు ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లేందుకు హీరో ముందుకు వచ్చి ప్రమోట్ చేయడం కూడా బాధ్యతలో భాగమే. సినిమా బాగుందా? బాలేదా? అనేది ప్రేక్షకుల నిర్ణయం. కానీ సినిమాను ప్రమోట్ చేయడం మేకర్స్ బాధ్యత.అందుకే నాని చేస్తున్న ఈ ప్రయత్నాన్ని కేవలం ఫ్లాప్ సినిమాకు పబ్లిసిటీ గా చూడాల్సిన అవసరం లేదు. సినిమాపై ఉన్న నెగిటివ్ టాక్‌ను మార్చాలని కాకుండా, ఇంకా థియేటర్లలో ఉన్న సినిమాను మరింత మంది ప్రేక్షకుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నంగా చూడాలి. టాక్ ఎలా ఉన్నా.. సినిమా థియేటర్లలో ఉన్నంతకాలం దాన్ని ప్రమోట్ చేయడం మేకర్స్ బాధ్యతే. ఆ బాధ్యతను నాని తీసుకోవడంలో తప్పేమీ లేదు.

# శభాష్ మచార్...

# పైలెట్ కు మోడీ ప్రశంసలు



న్యూఢిల్లీ, అక్టోబరు 1, దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. విమానం గాల్లో ఉండగానే కో–పైలట్ చేతిలో కత్తిపోటుకు గురైన భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచార్ అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించారు. తీవ్రంగా గాయపడినప్పటికీ పరిస్థితిని అదుపులో ఉంచుతూ విమానంలోని 174 మంది ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలను కాపాడేందుకు కీలకంగా వ్యవహరించారుఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. గురువారం ఉదయం సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను పంచుకున్న ప్రధాని.. కెప్టెన్ స్మిత్ మచార్‌ను హీరోగా అభివర్ణించారు. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో తీవ్రంగా గాయపడినా, ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు ఆయన చూపిన ధైర్యం, అచంచలమైన సంకల్పం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఆయన శౌర్యం వందలాది ప్రాణాలను కాపాడి, పెద్ద విషాదాన్ని నివారించిందని అన్నారు. కెప్టెన్ మచార్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు.అంతకుముందు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ కూడా కెప్టెన్ మచార్ సాహసాన్ని ప్రశంసించారు. కత్తిపోటుకు గురై తీవ్రంగా గాయపడినప్పటికీ దాడి చేసిన వ్యక్తిని ప్రతిఘటించి, కాక్‌పిట్ తలుపు తెరిచేందుకు సహకరించారని తెలిపారు. అనంతరం ప్రయాణికులు, సిబ్బంది కలిసి దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకోవడంతో గగనతలంలో పెను ప్రమాదం తప్పిందన్నారు. ఈ ఘటనలో 174 మంది ప్రాణాలను కాపాడిన కెప్టెన్ మచార్ నిజమైన హీరో అని కొనియాడారు

అసలేం జరిగిందంటే

మధ్యప్రాచ్యంలో మరోసారి తీవ్ర కలకలం రేపిన ఒక ప్రధాన వైమానిక భద్రతా ఘటనలో 174 మంది ప్రయాణికుల ప్రాణాలు దక్కాయి. దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లైదుబాయ్ విమానం 1073 పై జరిగిన దాడి, దానికి ఒక భారతీయ పైలట్ ఎదురొడ్డి నిలిచిన తీరు అంతర్జాతీయ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. విమానం గాల్లో ఉండగా కోపైలెట్ దాడికి పాల్పడగా, తీవ్ర గాయాలైనప్ప టికీ పైలట్ చూపిన తెగింపు వల్లే విమానంలోని ప్రయాణికులందరూ సురక్షితంగా బయట పడ్డారు.

అంతర్జాతీయ మీడియా , ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. విమానంలోని కాక్‌పిట్‌లో ఉన్న భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చార్ పై ఒక దుండగుడు అకస్మాత్తుగా చాకుతో దాడి చేశాడు. కెప్టెన్ స్మిత్‌ను తీవ్రంగా పొడవడంతో ఆయన రక్తసిక్తమయ్యారు. అయితే, ఎంతో సమయస్ఫూర్తి, ప్రాణాల కంటే ప్రయాణికుల భద్రతే ముఖ్యం అనుకున్న ఆయన తీవ్ర గాయాలతోనే కాక్‌పిట్ తలుపులను అన్‌లాక్ చేయడంలో విజయం సాధించారు. కాక్‌పిట్ డోర్ తెరుచుకోవడంతో వెంటనే అప్రమత్తమైన ఇజ్రాయెల్ ప్రయాణికులు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కి చెందిన విమాన సిబ్బంది కాక్‌పిట్‌లోకి దూసుకెళ్లారు. తీవ్రమైన ఘర్షణ అనంతరం ఆ దుండగుడిని లొంగదీసుకుని, హ్యాండ్‌కఫ్ చేసి బంధించారు. విమానాన్ని సురక్షితంగా సమీప విమానాశ్రయంలో ల్యాండింగ్ చేయడంతో ప్రయాణికులు, సిబ్బంది అందరూ హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.ఈ ఘటనపై ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ కెప్టెన్ స్మిత్ మచ్చార్‌ను రియల్ హీరోగా కొనియాడింది. భారతీయుడు, ఇజ్రాయెలీ, ఎమిరాటీ.. ఇలా వేర్వేరు దేశాలకు చెందిన వ్యక్తులు ఐక్యంగా నిలబడి ప్రదర్శించిన అసమాన ధైర్యసాహసాలు 174 మంది ప్రాణాలను కాపాడాయి.

తీవ్రంగా గాయపడిన కెప్టెన్ స్మిత్ మచ్చార్ త్వరగా కోలుకోవాలని కోరుకుం టున్నాం అని ఇజ్రాయెల్ ప్రకటించింది. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కెప్టెన్ స్మిత్ ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ విమానయాన భద్రతా సంస్థలు మరియు వివిధ దేశాల ప్రభుత్వాలు ఆయన చూపిన ధైర్యసాహ సాలను, సమయస్ఫూర్తిని ప్రశంసిస్తున్నాయి. వివిధ దేశాల మధ్య ఉన్న సహకారం, విమాన సిబ్బంది సమర్థతకు ఈ ఘటన ఒక నిదర్శనంగా నిలిచింది.

# గాంధీ జయంతి నుంచి వారం పాటు ఉద్యమం

న్యూఢిల్లీ, అక్టోబరు 1, (న్యూస్ పల్స్) కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఎన్నికల సంఘం వ్యవహారశైలికి వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేసేందుకు విపక్ష కూటమి ఐక్య కార్యాచరణను ప్రకటించింది. ఢిల్లీ వేదికగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ సహా కూటమి అగ్రనేతలు నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో భవిష్యత్ ఉద్యమ ప్రణాళికను వెల్లడించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని విపక్షాలు డిమాండ్ చేశాయి.అక్టోబర్ 2 గాంధీ జయంతి నుంచి అక్టోబర్ 8 వరకు దేశవ్యాప్తంగా వారం రోజుల పాటు సేవ్ డెమోక్రసీ పేరిట నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నట్లు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లో భారీ ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని, ఉద్యమంలో భాగంగా అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపీలందరితో కలిసి ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయానికి భారీ నిరసన ర్యాలీ చేపడతామని స్పష్టం చేశారు. అనంతరం అక్టోబర్ రెండో వారంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అపాయింట్‌మెంట్ కోరి, రాజ్యాంగబద్ధ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఏ విధంగా తన గుప్పిట్లోకి తీసుకుంటోందో వివరిస్తూ వినతిపత్రం అందజేయనున్నట్లు ఖర్గే వెల్లడించారు.ఎన్నికల వ్యవస్థలో జరుగుతోన్న ఓటు చోరీ వ్యవహారంపై సుప్రీంకోర్టులోని కేసులను వేగవంతం చేయాలని కోరడంతో పాటు, అక్టోబర్, నవంబర్ నెలల్లో దేశవ్యాప్తంగా 5 భారీ బహిరంగ సభలను నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ అధినేత తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎన్నికల కమిషన్‌లోని కొందరు అధికారులను కీలుబొమ్మలుగా వాడుకుంటున్నారని ఆయన ఆరోపణలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసిన వారిని తప్పకుండా శిక్షించేలా చూస్తామని రాహుల్ గాంధీ స్పష్టం చేస్తూ.. దేశంలో ఎన్నికలను కొల్లగొడుతున్నారనే వాస్తవాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో ప్రతిపక్షం విజయవంతమైందని, ముఖ్యంగా యువతలో ఈ అన్యాయాన్ని ఎదిరించే చైతన్యం పెరిగిందని పేర్కొన్నారు.మరోవైపు జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయకపోతే ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హెచ్చరించారు.

ఎన్నికల సంఘం పరిధిలో ఎస్ఐఆర్ అమలు, ఫామ్–6 మార్పులు, ఓటర్ల జాబితాల తొలగింపు, సాఫ్ట్‌వేర్ కేంద్రీకరణ వంటి కీలక నిర్ణయాలపై విచారణ చేయాలనిఅంటున్నారు. ఎన్నికల సంఘం విశ్వసనీయత కోల్పోయిందని, రాజ్యాంగ పరిరక్షణ కోసం క్షేత్రస్థాయి నుంచి న్యాయస్థానాల వరకు రాజీలేని పోరాటం సాగిస్తామని ఇండీ కూటమి ప్రకటించింది.

## సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

### – ఎస్పీ దిశానిర్దేశం

మదనపల్లె టౌన్: అక్టోబర్ 2న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ మదనపల్లె పర్యటన నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది.బుధవారం ఆర్.ఆర్ ఫంక్షన్ హాల్ లో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి బందోబస్తు విధుల్లోని అధికారులు, సిబ్బందితో బ్రీఫింగ్ నిర్వహించారు. మ్యాప్ ద్వారా బందోబస్తు ప్లాన్ ను వివరించారు. హెలిప్యాడ్ వద్ద భద్రత, కాన్వాయ్ రూట్, ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్, జన నియంత్రణపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

# బాలిక, యువకుడు ఆత్మహత్య



గుంటూరు ఎలుకల మందు తిని చెరువులో దూకి పదో తరగతి చదివే బాలిక, ఇంటర్ చదివిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు. గుంటూరు జిల్లా కాకుమాను మండల కేంద్రంలో ఉండే తాత, అమ్మమ్మ వద్ద ఉంటూ ఓ బాలిక (15) పదో తరగతి చదువుతోంది. బాలిక చదువుతున్న స్కూల్ బస్సుకు డ్రైవర్గా పని చేస్తున్న సాంబశివరావు కొడుకు విఘ్నేష్ (22) ఇంటర్ పూర్తి చేసుకొని ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలో తండ్రి కోసం తరచూ స్కూల్ వద్దకు వెళ్తూ బాలికతో పరిచయం పెంచుకుని విఘ్నేష్ ప్రేమలో పడ్డాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం అకస్మాత్తుగా ఇంట్లో నుంచి వెళ్లిపోయి, బుధవారం ఉదయం కోనంకి గ్రామ చెరువులో ఎలుకల మందు తిని దూకి ఈ ప్రేమ జంట ఆత్మహత్య చేసుకుంది.

# యూపీలో ఎస్పీ రథయాత్ర...

న్యూఢిల్లీ, అక్టోబరు 1, (న్యూస్ పల్స్) ఎన్నికలంటే అన్ని పార్టీలూ ఏదో ఒక యాత్ర చేపడతాయి. అది పాదయాత్రా? బస్సు యాత్రా? రథ యాత్రా? ఇలా రకరకాల యాత్రలను నిర్వహిస్తూ, ప్రజలకు దగ్గరవ్వడానికి ప్రయత్నాలు చేస్తారు. ఇది కలిసొస్తుంది కూడా. చాలా మంది నేతలు ఈ యాత్రలతో అత్యంత కీలకమైన పదవులను పొందగలిగారు కూడా.ఇప్పుడు ఇదే కోవలో సమాజ్ వాదీ పార్టీ అధినేత, మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ కూడా వచ్చి చేరారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని, లక్నో నుంచి రాయ్‌బరేలీ వరకు 'ఖఅం రథ యాత్ర' ప్రచారాన్ని ప్రారంభించారు. 2027 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల కోసం చేపట్టిన ఈ యాత్రలో భాగంగా, పార్టీ కార్యకర్తలతో కూడిన ఎరుపు రంగు బస్సులు గురువారం రాష్ట్ర రాజధాని నుంచి బయలుదేరాయి. వెనుకబడిన వర్గాలు, దళితులు మరియు మైనారిటీల (పిచ్‌డా, దళిత్, అల్పసంఖ్యాక్) కూటమిపై దృష్టి సారిస్తూ, మధ్య ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ చేపట్టిన విస్తృత ప్రచారంలో భాగంగా ఈ 'ఖఅం రథ' యాత్రను నిర్వహిస్తున్నారు.దీనిని అఖిలేష్ యాదవ్ ప్రగతిశీల, సానుకూల దృక్పథం కలిగిన కూటమిగా అభివర్ణించారు.ఏ వర్గాలనైతే దృష్టిలో పెట్టుకొని అఖిలేష్ రథయాత్రను ప్రారంభించారో, అవే వర్గాలు గత ఎన్నికల్లో బీజేపీకి గంపగుత్తగా మద్దతిచ్చాయి. అందులో కొన్ని ఎంఐఎంకి మద్దతిచ్చాయి. ఈ సారి వాటిని చీల్చాలని అఖిలేష్ ఓ వ్యూహం కూడా వేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ రథ యాత్రకు అఖిలేష్ అచ్చు అలాంటి పేరే పెట్టారు కూడా. పిచ్‌డా, దళిత్, అల్పసంఖ్యాక్ అని రథయాత్ర పేరు.అంతేకాకుండా ఒక్క రథయాత్రతో మూడు లక్ష్యాలను సాధించాలని అఖిలేష్ లక్ష్యంగా పెట్టుకున్నారు. కుల ప్రాతిపదికన ప్రజలను సమీకరించడం, ప్రెషర్ పాలిటిక్స్‌ను తెరపైకి తేవడం రెండోది, ఎన్నికల కోసం పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం. ఈ మూడు లక్ష్యాల కోసం ఈ యాత్రను చేపడుతున్నారు.రాహుల్ గాంధీ పార్లమెంటరీ నియోజకవర్గమైన రాయ్‌బరేలీకి అఖిలేష్ 'ఖఅం రథం' రాకపై వివిధ రాజకీయ విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, లోక్‌సభ ఎన్నికల మాదిరిగానే అసెంబ్లీ ఎన్నికల్లోనూ 'ఇండియా' కూటమి పటిష్టంగా కొనసాగుతుందని అఖిలేష్ యాదవ్ స్పష్టం చేస్తున్నారు. ఈ కూటమిలో సీట్ల పంపకాలకు సంబంధించి ఇరు పార్టీల నాయకులు ప్రకటనలు చేస్తున్నారు.రాహుల్ గాంధీ రాయ్‌బరేలీ ఎంపీ అయినప్పటికీ, 1999 నుండి కాంగ్రెస్ పార్టీ ఈ స్థానాన్ని నిరంతరాయంగా తన ఆధీనంలో ఉంచుకుంటూ వస్తోందన్న విషయాన్ని గమనించాలి. అయితే, ఆ ప్రాంతంలో పార్టీకి ఒక్క అసెంబ్లీ స్థానం కూడా లేదు. రాయ్‌బరేలీలో మొత్తం ఆరు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి; 2022 అసెంబ్లీ ఎన్నికల్లో వీటిలో నాలుగింటిని ఎస్పీ గెలుచుకోగా, రెండింటిని బీజేపీ గెలుచుకుంది. ఈ సారి రాయ్ బరేలీపై కూడా అఖిలేష్ కన్నేశారు.

# అరకు కాఫీని గౌరవించుకోవడం గర్వకారణం

## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



అమరావతి, అక్టోబర్ 1: అంతర్జాతీయ కాఫీ దినోత్సవం సందర్భంగా తూర్పు కనుమల అద్భుతమైన ప్రకృతి ఒడిలో పండే ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక సంపద అయిన 'అరకు కాఫీ'ని గౌరవించుకోవడం ఎంతో గర్వకారణమని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. అరకు కాఫీలోని ప్రతి కప్పు తూర్పు కనుమల సువాసనను, అక్కడి నేల సారవంతమైన గుణాన్ని, గిరిజన రైతుల కఠోర శ్రమను తనలో ఇముడ్చుకుని ఉంటుందన్నారు. 'నా దృష్టిలో, అరకు కాఫీ అంటే కేవలం దాని రుచి, సువాసన మాత్రమే కాదు. ఇది మన అడవులు, గిరిజన సమాజాలు, వారి సంప్రదాయ విజ్ఞానం మధ్య ఉన్న అనుబంధానికి ప్రతీక' అని అన్నారు.అరకు లోయల నుంచి ఢిల్లీలోని పార్లమెంట్ వరకు అక్కడ ప్రత్యేక స్టాళ్ల ద్వారా అరకు కాఫీని ప్రదర్శించారని పవన్ తెలిపారు. దీని ప్రస్థానం, సమాజాల మూలాల నుంచి వచ్చిన ఒక స్థానిక ఉత్పత్తి భారతదేశ కథను విశాల ప్రపంచానికి ఎలా చాటగలదో తెలియజేస్తుందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా అరకు కాఫీని, దాని సాగులో పాలుపంచుకుంటున్న గిరిజన కుటుంబాల కృషిని ప్రత్యేకంగా ప్రస్తావించారని తెలిపారు. అరకు కాఫీని సాధ్యం చేస్తున్న రైతులు, అడవులు, తూర్పు కనుమలను గౌరవించుకుందామన్నారు. ఆంధ్రప్రదేశ్ కొండల నుంచి ప్రపంచంలోని ప్రతి మూలకు అరకు కాఫీని చేరవేసే దిశగా కృషి చేద్దామని అన్నారు. 'ఒక కప్పు అరకు కాఫీ అంటే మన నేల రుచి, మన ప్రజల కథ, మన తూర్పు కనుమల సువాసనల కలయిక. అంతర్జాతీయ కాఫీ దినోత్సవ శుభాకాంక్షలు' అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

# పెంచిన స్విమ్మింగ్ పూల్ ఫీజు తగ్గించాలి ..

## ప్లకార్డులతో స్విమ్మర్ల నిరసన



హనుమకొండ , అక్టోబర్ 1: హనుమకొండ బాలసముద్రంలోని స్విమ్మింగ్ పూల్ వద్ద స్విమ్మర్లు ఆందోళనకు దిగారు. స్విమ్మింగ్ పూల్ నెలసరి రుసుమును విపరీతంగా పెంచడంతో ఇబ్బందులు పడుతున్నామంటూ స్విమ్మర్లు ప్లకార్డులతో గురువారం నిరసన తెలిపారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే ఇన్చార్జి డిఎస్ఓ కొత్త ప్రశాంత్ వెంటనే పోలీసులకు సమాచారం అందించడంపై మండిపడ్డారు. గతంలో స్విమ్మింగ్ పూల్ నిండుగా కలకలలాడుతూ ఎంతోమంది స్విమ్మింగ్ చేసేవారు. అయితే స్విమ్మింగ్ పూల్ మరమ్మతు పేరుతో సంవత్సరనరపాటు నిలిపివేశారు. మరమ్మతుల అనంతరం స్విమ్మింగ్ చేయడానికి చెల్లించాల్సిన రుసుమును విపరీతంగా పెంచడంతో చాలామంది తగ్గిపోయారు. ఇప్పటికైనా అధికారులు దీనిని దృష్టిలో ఉంచుకొని రుసుమును తగ్గిస్తే బాగుంటుందని స్విమ్మర్లు డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఎంతోమంది పోటీలకు వెళ్లి కూడా ఇక్కడి నుండి బహుమతులు గెలుచుకున్నారు. కానీ ఇప్పుడు అది పేదవారికి అందని ద్రాక్షగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రేట్లు తగ్గించాలని డిమాండ్ చేశారు.

## ఓట్ చోరీకి బీజేపీ నేతలు పాల్పడుతున్నారు

### దానం నాగేందర్

హైదరాబాద్ ఓట్ల తొలగింపులో ఎన్నికల కమిషన్ వైఖరి మార్చుకోకపోతే , ఎన్నికల కమిషన్ కార్యాలయంతో పాటు హైదరాబాద్ నగరం తగలబడి పోతుందని మాజీ మంత్రి దానం నాగేందర్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల కమిషన్ అధికారులు బిజెపి తో అనుబంధంగా పని చేస్తున్నారని ఆయన ఆరోపించారు. హిమాయత్ నగర్ డివిజన్ లో సీసీ రోడ్ పనుల ప్రారంభోత్సవంలో దానం పాల్గొన్నారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ... కేవలం హిమాయత్ నగర్ డివిజన్ లోనే 20 వేల ఓట్ల వరకు తొలగించారని... బిజెపి నాయకులు ఢిల్లీ కేంద్రంగా ఓట్ చోరీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. తన నియోజకవర్గంలో ప్రతి ఒక్కరి ఓటును కాపాడుకునే బాధ్యత తనపై ఉందన్నారు. ఎన్నికల కమిషన్ తక్షణమే తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని దానం డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ పోరాటాలు ఉధృతంగా ఉంటాయని దానం స్పష్టం చేశారు.

# ఆస్తులు పంపకం తరువాత పట్టించుకోని కొడుకులు

## వృద్ధ దంపతుల ఆత్మహత్య

సంగారెడ్డి జిల్లాలో విషాద ఘటన జరిగింది. 25 ఎకరాలు తీసుకుని ముగ్గురు కొడుకులు తల్లిదండ్రులను రోడ్డున పడేసారు. వంట చేసే సత్తువ లేక ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని రోజులు గుడుపుతున్నారు. బతుకు దెరువు కోసం రెండెకరాలు ఇప్పించాలని కోరినా ఎవరూ పట్టించుకోని వైనం. దిక్కు లేక బావిలో దూకి వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు.

నారాయణఖేడ్ మండలం చాప్తా.కె గ్రామంలో తమకున్న 25 ఎకరాల భూమిని, ఇంటిని తమ ముగ్గురు కొడుకులు సిద్ధారెడ్డి, కృష్ణారెడ్డి, సంగారెడ్డిలకు ముంగే నర్సారెడ్డి(88), అంజమ్మ(85) అనే వృద్ధ దంపతులు పంచి ఇచ్చారు. భూ పంపకాలు జరిగిన రోజు నుండి తల్లిదండ్రులను కొడుకులు గాలికి వదిలేశారని, అంజమ్మ ఆరోగ్యం బాగాలేక వంట చేసుకునే పరిస్థితి లేక కొన్ని రోజులు ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని గడిపారని గ్రామస్తులు తెలిపారు. రెండుమూడేళ్లుగా తమ కొడుకులు పట్టించుకోవడం లేదని, పంచిన భూమిలో ఒకటి, రెండెకరాలు తమకు తిరిగి ఇప్పించాలని పోలీసులను, అధికారులను వేడుకున్నా పట్టించుకోలేదు. దీంతో తినడానికి తిండి కూడా లేదని మనస్తాపంతో వ్యవసాయ బావిలో దూకి వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు.

మృతుల మనవడు తిరుపతిరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# క్లస్టర్ యూనివర్సిటీ నిర్మాణాల్లో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం: బుట్టా రేణుక

**జగన్నాథగట్టులో నిర్మాణ పనులను పరిశీలించిన మాజీ ఎంపీ బుట్టా రేణుక, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణమ్మ**

**వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయాంలో 90 శాతం పనులు పూర్తి..**

**కూటమి ప్రభుత్వం వచ్చాక నిలిచిన పనులు**

**రూ.139 కోట్ల ప్రాజెక్టులో రూ.55 కోట్లు ఖర్చు.. ఇంకా రూ.74.5 కోట్లు అవసరమని అసెంబ్లీలో ప్రభుత్వమే వెల్లడి**

**వచ్చే విద్యా సంవత్సరం నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా పనుల్లో కనిపించని పురోగతి**

కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ నిర్మాణ పనులను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ పార్లమెంట్ సభ్యురాలు బుట్టా రేణుక, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణమ్మ విమర్శించారు. జగన్నాథగట్టులో నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు.

వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో విద్యారంగానికి ప్రాధాన్యతనిస్తూ నిర్మాణాలను వేగంగా ముందుకు తీసుకెళ్లామని, సుమారు 75 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రభుత్వం మారిన తర్వాత పనులు నిలిచిపోవడం దురదృష్టకరమన్నారు.× రూ.139 కోట్ల ప్రాజెక్టులో రూ.55 కోట్లు ఖర్చు చేశామని, మరో రూ.74.5 కోట్లు అవసరమని ప్రభుత్వం అసెంబ్లీలోనే వెల్లడించిందని గుర్తుచేశారు. ఇకనైనా నిధులు విడుదల చేసి నిర్మాణాలను పూర్తి చేయడంతో పాటు రెగ్యులర్ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, బోధన?బోధనేతర సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు.× జగన్నాథగట్టు క్లస్టర్ యూనివర్సిటీ, సిల్వర్ జూబ్లీ కళాశాల భవనాలను వెంటనే పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని బుట్టా రేణుక ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.× ఈ కార్యక్రమంలో చేనేత విభాగ రాష్ట్ర కార్యదర్శి సాన శ్రీనివాసులు, గోనెగండ్ల మండలం మహిళా విభాగ అధ్యక్షురాలు అరుణ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ స్కూల్లో చెత్తాచెదారం..

## రోగాల బారిన విద్యార్థులు, మండిపడుతున్న తల్లిదండ్రులు

హనుమకొండ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం.. పట్టించుకోని అధికారుల తీరు విద్యార్థులకు శాపంగా మారింది. పచ్చని, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యనాభ్యసించాల్సిన విద్యార్థులు పేరుకుపోయిన చెత్త చెదారంతో సావాసం చేస్తున్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాల్సిన విద్యార్థులు రోగాల బారిన ఇంటికెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. తమ పిల్లలు ఇలాంటి వాతావరణంలో ఉండాల్సి రావడం బాధాకరమని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తూతూమంత్రంగా ఉత్తుత్తి స్పోర్ట్స్ స్కూల్: కాంగ్రెస్ ప్రభుత్వం తూతూమంత్రంగా ఉత్తుత్తి స్పోర్ట్స్ స్కూల్ హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ప్రారంభించారు. ఇంకా ఇప్పటివరకు ఎలాంటి జీవో ప్రకటించలేదు.అరకొర వసతులు సమకూర్చి నెట్టుకొస్తున్నారు. రెండేళ్లుగా విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. స్పోర్ట్స్ పాఠశాలలో పారిశుధ్య పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. పాఠశాల పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి



అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తోంది. దీంతో పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులకు క్రీడలతో పాటు నాణ్యమైన విద్య, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాల్సిన పాఠశాల ఆవరణలోనే చెత్త పేరుకుపోవడం పట్ల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టించుకోని అధికారులు..: చెత్త కారణంగా దోమలు, ఈగలు వృద్ధి చెందడంతో పాటు దుర్వాసన వస్తోందని చెబుతున్నారు. అపరిశుభ్రత కారణంగా విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు ప్రజాప్రతినిధులు ఎటువైపు కన్నెత్తి చూడడం లేదని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, క్రమం తప్పకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్పోర్ట్స్ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు శాశ్వత చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# అయ్యపరాజు గూడెంలో బీటీ రోడ్ల నిర్మాణపనులకు శంకుస్థాపన

ఏలూరు లింగపాలెం మండలం అయ్యపరాజుగూడెం గ్రామంలో రూ.2 కోట్ల 53 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ సీనియర్ యువ నాయకులు మేడికొండ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్ట మహేష్ కుమార్ యాదవ్, చింతలపూడి శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే కలిసి నూతన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.2.53 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో రహదారుల నిర్మాణం కీలక పాత్ర పోషిస్తుందని, నూతన రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని భావిస్తున్నారు. ముఖ్యంగా నిత్యం ప్రయాణించే ప్రజలు, రైతులు, విద్యార్థులు, వాహనదారులకు ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది.గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా చేపడుతున్న ఈ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# స్కూలు బస్సు బోల్తా..ముగ్గురు విద్యార్థులకు గాయాలు

నూజివీడు అగిరిపల్లి నుండి నూజివీడు వెళ్లే మార్గంలో వడ్లమాను గ్రామం దాటిన అనంతరం సూది గట్టు వద్ద సుమారు ఉదయం 8:15 గంటల సమయంలో, బిస్ స్కూల్ కు చెందిన బస్సు వాహనాన్ని ఓవర్టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న టూ వీలర్ను ఢీకొనడంతో అదుపుతప్పి రోడ్డు మార్జిన్ దాటి బోల్తా పడింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 30 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించడం అయినది. మిగిలిన విద్యార్థులను సురక్షితంగా వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగింది.

# భారత పైలట్ స్మిత్ మచ్చర్ కుటుంబానికి మోదీ ఫోన్..

## అండగా ఉంటామని ప్రధాని భరోసా





ఫ్లైదుబాయ్ విమానంలో భారత పైలట్‌పై సహ పైలట్ కత్తితో దాడితీవ్ర గాయాలతోనూ 174 మంది ప్రయాణికులను కాపాడిన కెప్టెన్‌స్మిత్ ధైర్యాన్ని కొనియాడి, పూర్తి సహాయం అందిస్తామని హామీఫ్లైదుబాయ్ విమానంలో సహ పైలట్ చేతిలో కత్తి దాడికి గురై, తీవ్ర గాయాలతోనూ ప్రయాణికులను కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ కుటుంబంతో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. స్మిత్ చూపిన అసామాన్య ధైర్య సాహసాలను ప్రధాని కొనియాడారు. నిన్న దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. విమానం గాల్లో ఉండగా.. కో-పైలట్ అకస్మాత్తుగా కెప్టెన్ స్మిత్‌పై కత్తితో దాడికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలపాలైనప్పటికీ, స్మిత్ ధైర్యం కోల్పోకుండా కాక్‌పిట్ డోర్‌ను తెరిచారు. దీంతో ప్రయాణికులు వెంటనే స్పందించి, లోపలికి ప్రవేశించి దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. స్మిత్ సమయస్ఫూర్తి వల్ల విమానంలోని 174 మంది ప్రయాణికులకు పెను ప్రమాదం తప్పింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం, ప్రధాని మోదీ నేరుగా స్మిత్ భార్య, తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడారు. గాయపడిన పైలట్‌కు భారత రాయబార కార్యాలయాల ద్వారా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అయితే, సహ పైలట్ దాడికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. అధికారులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

# ఖైరతాబాద్ టికెట్ అడిగే హక్కు నాకుంది..

**బీజేపీ సీనియర్ నేత కీలక వ్యాఖ్యలు**

**అవకాశం ఇస్తే పోటీ చేస్తానంటున్న చింతల రామచంద్రారెడ్డి**

**టికెట్‌పై తుది నిర్ణయం పార్టీ అధిష్ఠానినేదనని వ్యాఖ్య**

**దానం అనర్హతపై బీజేపీ న్యాయపోరాటం చేసిందని వ్యాఖ్య**

**ఉప ఎన్నికపై బీజేపీలో టికెట్ ఆశావహుల పోటీ**



ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నిక నేపథ్యంలో బీజేపీ నేత చింతల రామచంద్రారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఖైరతాబాద్ టికెట్ అడిగే హక్కు తనకు ఉందని స్పష్టం చేశారు. పార్టీ అధిష్ఠానం ఎవరిని అభ్యర్థిగా నిలబెట్టాలన్నది నిర్ణయిస్తుందని, తాను మాత్రం టికెట్ ఆశిస్తున్నానని చెప్పారు. దానం నాగేందర్ పార్టీ మారి కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలోనే ఆయన ఎమ్మెల్యే పదవి రద్దు కావాల్సిందని చింతల అన్నారు. దానం అనర్హత కోసం బీజేపీ న్యాయపోరాటం చేసిందని తెలిపారు. హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టులోనూ పోరాడామని చెప్పారు. తమ ప్రయత్నాల ఫలితంగానే దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడిందని పేర్కొన్నారు. దానం నాగేందర్ ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ టికెట్‌పై 2023లో ఎమ్మెల్యేగా గెలిచిన విషయం తెలిసిందే. ఆ తర్వాత 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్లను విచారించిన తెలంగాణ హైకోర్టు ఆయనను అనర్హుడిగా ప్రకటించింది. సుప్రీంకోర్టు కూడా హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయింది. ఇదే సమయంలో ఖైరతాబాద్ ఉప ఎన్నికపై బీజేపీలో టికెట్ ఆశిస్తున్న నేతల సంఖ్య పెరుగుతోంది. చింతల రామచంద్రారెడ్డి గతంలో ఖైరతాబాద్ నుంచి ప్రాతినిధ్యం వహించారు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు టికెట్ రేసుపై ఆసక్తిని పెంచాయి. అయితే అభ్యర్థి ఎంపికపై తుది నిర్ణయం పార్టీ నాయకత్వమే తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీజేపీ ఎనిమిది లోక్‌సభ స్థానాలు గెలిచిందని చింతల గుర్తుచేశారు. గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ పార్టీ విజయం సాధించిందన్నారు. ఖైరతాబాద్‌లోనూ బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తాను ఇప్పటివరకు ఖైరతాబాద్‌ను వదిలి ఎక్కడికీ వెళ్లలేదని, పార్టీ అవకాశం ఇస్తే బరిలోకి దిగుతానని చెప్పారు.

# కుషాయిగూడ మెడ్ ప్లస్ డయాగ్నస్టిక్ సెంటర్లో దొంగతనం

మేడ్చల్ కుషాయిగూడ పోలీసు స్టేషన్ పరిధిలోని ఏ.ఎస్.రావు నగర్ లోని మెడ్ ప్లస్ డయాగ్నస్టిక్ సెంటర్ లో టెస్టులు చేయించుకోడానికి వచ్చిన మహిళ బంగారు నగలు మాయం కావడం కలకలం రేపింది. సుమారు నలబై గ్రాముల బంగారు నగలు మాయం అయ్యాయి. ఇంటికి వెళ్ళి చెక్ చేసుకోవడంతో బంగారు నగలు కనిపించకుండా పోయాయి. దాంతో బాధితులు కుషాయిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బంట్వారం మండలం బోపునరం గ్రామంలో విషాదం

## అన్నదమ్ముల గొడవ

## అన్నను చంపిన తమ్ముడు

వికారాబాద్ జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది.. ఆస్తి కోసం మొదలైన అన్నదమ్ముల గొడవ చివరకు ప్రాణం తీసేంత వరకు వెళ్లింది.. బంట్వారం మండలం చొపునారం గ్రామంలో తమ్ముడి చేతిలో అన్న హతమయ్యాడు.. ఆస్తి వివాదంతో మాటామాటా పెరగడంతో.. క్షణికావేశంలో తమ్ముడు తన సొంత అన్నపై కమ్మకత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలతో అన్న రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు..సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని నిందితుడు మల్లేశాన్ని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు..

# చెత్త ఆటోలో పేలుడు తప్పిన ప్రాణ నష్టం

హైదరాబాద్ కాప్రా సర్కిల్ కుషాయిగూడ హనుమాన్ నగర్ కాలనీలోని స్పార్కిల్ రబ్బర్ కంపెనీ వద్ద ఉదయం చెత్త ఆటోలో బ్లాస్టింగ్ జరిగింది. చెత్త ఆటోలో ఉన్న పరిశ్రమలకు సంబంధించిన స్క్రాబ్, గుర్తు తెలియని పేలుడు పదార్థాల వల్ల పేలుడు సంభవించి ఉంటుందని ప్రాథమిక అంచనా... ఈ పేలుడులో ఎవరికి ఎలాంటి ప్రమాదం గానీ ఆస్తి ప్రాణ నష్టం జరగలేదు. దీనితో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. స్వల్పంగా ఆటోకు డ్యామేజ్ జరిగింది. సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు కుషాయిగూడ పోలీసులు. అనుమతులు లేని పరిశ్రమలపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఎమ్మెల్సీ సీట్ల కేటాయింపులో బీసీలకు అన్యాయం ఓయూలో నిరసన

హైదరాబాద్ ఎమ్మెల్సీ సీట్ల కేటాయింపులో బీసీలకు అన్యాయం జరిగిందంటూ ఓయూలో బీసీ విద్యార్థులు, పరిశోధకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీ సీ స్టూడెంట్ ఫెడరేషన్ స్టేట్ ప్రెసిడెంట్ సైదులు యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘాల నేతలు ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సైదులు యాదవ్ మాట్లాడుతూ.. రెండు ఎమ్మెల్సీ స్థానాలను రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఎన్నికల్లో సామాజిక న్యాయం అంటూ హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంలో కాంగ్రెస్ విఫలమైందని ధ్వజమెత్తారు. కులగణనలో బీసీ జనాభా అధికంగా ఉన్నా రాజకీయ ప్రాతినిధ్యం ఇవ్వడం లేదని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీ విద్యార్థుల ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్లో నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి వీరుడు దొడ్డి కొమరయ్య పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం పేరుతో బీసీలకు అన్యాయం చేస్తే కాంగ్రెస్కు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

# 25 మంది బీజేపీ ఎమ్మెల్యేలు మాతో టచ్ లో ఉన్నారు: అఖిలేశ్ యాదవ్

**రాజ్యసభ ఎన్నికల వేళ యూపీలో ముదురుతున్న మాటల యుద్ధం**

**అఖిలేశ్ వ్యాఖ్యలకు బీజేపీ కౌంటర్**

**ఎస్పీ ఎమ్మెల్యేలే తమతో టచ్ లో ఉన్నారన్న కేశవ్ ప్రసాద్ మౌర్య**



ఉత్తరప్రదేశ్‌లో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. రాజ్యసభ, అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, అధికార బీజేపీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారంటూ సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనికి బీజేపీ కూడా అంతే దీటుగా బదులిచ్చింది. ఎస్పీకి చెందిన 25 మంది ఎమ్మెల్యేలు తమతో సంప్రదింపులు జరుపుతున్నారంటూ యూపీ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య కౌంటర్ ఇవ్వడంతో రాజకీయం మరింత రసవత్తరంగా మారింది.”చాలా మంది బీజేపీ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారు. కానీ వారందరినీ పార్టీలో చేర్చుకోవడం కష్టంగా ఉంది. మేం నిలబెట్టుకోలేని హామీలు ఇవ్వదలచుకోలేదు” అని అఖిలేశ్ వ్యాఖ్యానించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పాత మిత్రులతోనే కలిసి పోటీ చేస్తామని, కాంగ్రెస్‌తోనూ పొత్తుల గురించి చర్చలు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఇదే సమయంలో రామాలయ విరాళాల దొంగతనం ఘటనపై బీజేపీని విమర్శిస్తూ, విరాళాలు దొంగిలించి పెద్ద ఆర్థిక వ్యవస్థను నిర్మించలేరని ఎద్దేవా చేశారు. అఖిలేశ్ వ్యాఖ్యలపై కేశవ్ ప్రసాద్ మౌర్య తీవ్రంగా స్పందించారు. “సమాజ్‌వాదీ పార్టీకి చెందిన 25 మంది ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో ఎస్పీకి మేం పెద్ద షాక్ ఇస్తాం” అని ఆయన హెచ్చరించారు. మొత్తంమీద, యూపీలో 10 రాజ్యసభ స్థానాలకు అక్టోబర్ 16న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ ఆరోపణలు, ప్రత్యారోపణలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి.

# దేవుళ్ల పేర్లతో హిందూవుల మధ్య చిచ్చు: రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు

**శివుడు, రాముడిపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం**

**దేవుళ్లను కూడా రాజకీయాల్లోకి లాగడంపై కిషన్ రెడ్డి అభ్యంతరం**

**ఇచ్చిన హామీలు పక్కనపెట్టి కొత్త వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపణ**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పరమేశ్వరుడు



పేదల దేవుడని, శ్రీరాముడు ధనికుల దేవుడని సీఎం చేసిన వ్యాఖ్యలు మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించేలా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలతో ఏకంగా దేవుళ్లను కూడా రాజకీయాల్లోకి లాగారని కిషన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. శివుడు, రాముడి పేర్లతో చేసిన ఈ వ్యాఖ్యలు యావత్ హిందూ సమాజాన్ని అవమానించేలా ఉన్నాయని, హిందువుల మధ్య అనవసర గొడవలు పెట్టే ప్రయత్నమని అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనపెట్టి, ఇలాంటి కొత్త వివాదాలను ముందుకు తెస్తోందని ఆరోపించారు. ప్రజలను విభజించడం కాంగ్రెస్ పార్టీకి ఎప్పటినుంచో ఉన్న అలవాటు అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి ఒక సవాల్ విసిరారు. “హిందూ దేవుళ్లపై మాట్లాడిన విధంగా ఇతర మతాల దేవుళ్ల గురించి మాట్లాడే ధైర్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉందా?” అని ఆయన ప్రశ్నించారు.

## జింబాబ్వేలో హెలికాప్టర్ కూలి ఏడుగురు మృతి....

జింబాబ్వేలోని మారోండెరా గ్రామీణ ప్రాంతంలో బుధవారం ఒక హెలికాప్టర్ కూలిపోవడంతో ఏడుగురు మరణించారు. మృతులలో ఒక ప్రముఖ వ్యాపారవేత్త, నలుగురు ప్రయాణికులు, ఇద్దరు పైలట్లు ఉన్నారు. ప్రభుత్వ ప్రతినిధి నిక్ మంగ్వానా ఈ విషయాన్ని ధృవీకరించారు. అత్యవసర సేవల సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అనుమానిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

# లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ: ప్రధాని మోదీ

### యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ
### స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన ప్రధాని



లక్షలాది మంది యువత ఆశయాలకు యూపీఎస్సీ ప్రతీక అని వ్యాఖ్యసర్దార్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలను స్మరించుకున్న ప్రధానిభారత పైలట్ స్మిత్ ధైర్యాన్ని కొనియాడిన మోదీ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తో పాటు '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నిన్న జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "నిన్న జరిగిన ఘటనలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా, 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడు" అని మోదీ అన్నారు. స్మిత్ ఘనత మనందరికీ గర్వకారణమని, తాను ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు. యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. "ఇది కేవలం ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదు, ఇది లక్షలాది యువత ఆశయాల వేడుక. ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దం. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోదీ గుర్తుచేసుకున్నారు. "1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆనాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ ఆయన సంస్కృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూశాను. అదేవిధంగా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని నడపడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు. స్వతంత్ర భారతానికి అవసరమైన 'ఉక్కు చట్రాన్ని' (స్టీల్ ఫ్రేమ్) సర్దార్ పటేల్ అందించారు. ఈ సంస్థను దేశానికి ఒక ప్రధాన స్తంభంగా తీర్చిదిద్దారు" అని మోదీ వివరించారు. 1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన ఈ సంస్థ, శతాబ్ద కాలంలో ఎన్నో మార్పులకు లోనై స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని ప్రధాని గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 1న ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు ఈ కార్యక్రమంతో ముగిశాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, విద్యావేత్తలు, యూపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

## హబీబ్నగర్లో కాస్మొటిక్స్, మెడికల్ స్టోర్లపై టాస్క్‌ఫోర్స్ దాడులు

హైదరాబాద్ హబీబ్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాంపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో కాస్మొటిక్స్, మెడికల్ స్టోర్లపై ఇన్చార్జ్ డీసీపీ కె.ఎస్. రావు ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ టాస్క్‌ఫోర్స్, శంషాబాద్ టాస్క్‌ఫోర్స్, గోల్కొండ టాస్క్‌ఫోర్స్ బృందాలు సంయుక్తంగా దాడులు నిర్వహించాయి. తనిఖీల్లో మేడ్ ఇన్ పాకిస్థాన్ కాస్మొటిక్స్ విక్రయిస్తున్నట్లు, అలాగే సరైన లైసెన్సులు లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. పలు దుకాణాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. స్వాధీనం చేసుకున్న వస్తువులు, కేసులు మరియు తదుపరి చర్యలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పర్యావరణం ద్వారానే ప్రజాహితం

### తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ శ్రీనివాస్
### స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా
### మొక్కలు నాటిన బ్యాంకు సిబ్బంది

కరీంనగర్, అక్టోబర్ 1 పర్యావరణాన్ని కాపాడుకోవడం ద్వారానేప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండగలుగుతారని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ కత్తి శ్రీనివాస్ అన్నారు.మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛత సేవ కార్యక్రమంలో భాగంగాబ్యాంకు మేనేజర్లు,సిబ్బందితో కలిసి గురువారం స్థానిక సప్తగిరి కాలనీ లోయర్ మానేరు డ్యాం వద్ద మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానాటికి పెరిగిపోతున్న కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు.పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా గుర్తించాలని ఆయన కోరారు.గాలి, నీరు, నేల మరియు జీవవైవిధ్యాన్ని కాపాడుకోవడం మానవాళి మనుగడకు అత్యంత ముఖ్యమని అన్నారు.మనచుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు.గ్రామీణ అభివృద్ధిలో టిజీబి పాత్ర...గ్రామీణ అభివృద్ధిలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ముఖ్య భూమిక పోషిస్తున్నదనిరీజనల్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. గ్రామీణ ప్రజలు ముఖ్యంగా రైతులకు గ్రామీణ బ్యాంక్ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కరీంనగర్ రీజియన్ పరిధిలో 59 శాఖల ద్వారా బ్యాంక్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు.డిపాజిట్ల సేకరణ,రుణాల మంజూరులో తమ బ్యాంక్ పారదర్శకంగా పనిచేస్తుందని చెప్పారు.బ్యాంక్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీనియర్ మేనేజర్(ఆపరేషన్స్) కందుల సుబ్బారావు, సీనియర్ మేనేజర్ బిజినెస్ కే వంశీకృష్ణ,నోడల్ ఆఫీసర్ జి మౌనిక, చీఫ్ మేనేజర్ జలంధర్ రెడ్డి, రమణారెడ్డి, మేనేజర్లు కొండపలకల వేణుమాధవ్,ఎం ప్రవీణ్ రెడ్డి వివిధ బ్యాంక్ శాఖల మేనేజర్లు, రీజినల్ మేనేజర్ కార్యాలయ సిబ్బందిపాల్గొన్నారు.

## అధిక లోడుతో వెళ్తున్న రెండు ఇసుక లారీలు సీజ్...
## ఎట్టకేలకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదేశాలపై స్పందించిన అధికారులు.



పెనమలూరు నియోజకవర్గంలో చోడవరం నుంచి పెనమలూరు వైపు వస్తున్న ఇసుక లారీలను పోలీసులు అడ్డుకున్నారు.గత ఆరు నెలలుగా అక్రమంగా, అధిక లోడుతో ఇసుక తరలిస్తున్న లారీలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ డిమాండ్.ఎమ్మెల్యే ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు ఇసుక లారీలను తనిఖీ చేశారు.నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్నట్లు గుర్తించిన రెండు లారీలపై కేసులు నమోదు.కేసులు నమోదు చేసిన అనంతరం రెండు లారీలను పెనమలూరు ఎమ్మార్వో కార్యాలయానికి తరలించిన పోలీసులు.అధిక లోడుతో ఇసుక రవాణాపై ఇకపై కఠిన చర్యలు ఉంటాయా? అన్నదే చర్చనీయాంశంగా మారింది.

# పాత బస్తీలో చారిత్రక బావికి ప్రాణం పోస్తున్న హైడ్రా

### నిజాంలు నీళ్లు తాగిన బావి పునరుద్ధరణకు శ్రీకారం
### బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు చెంత ఊట బావి పునరుద్ధరణ



హైదరాబాద్, అక్టోబరు 01: చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమైన హైదరాబాద్‌లో ఏ ప్రాంతానికి వెళ్లినా చారిత్రక నేపథ్యం ఉంటుంది. ఇక పాత బస్తీ గురించి ప్రత్యేకంగా చెప్పాలా.. అడుగడుగునా చారిత్రక సాక్ష్యాలు ఎన్నో.. అదే కోవకు వస్తుంది శివరాంపల్లిలోని బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు. ఈ చెరువుకు 356 ఏళ్ల చరిత్ర ఉంటే.. ఆ చెరువు కింది భాగంలో 1.50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఊట బావికి కూడా అంతే ప్రత్యేకమైన చారిత్రక నేపథ్యం ఉంది. ఇప్పటికే చెరువును పునరుద్ధరించి పాతబస్తీకి మణిహారంగా అందించిన హైడ్రా ఇప్పుడు ఆ చెరువు కింద ఉన్న ఊట బావికి కూడా జీవం పోయాలని నిర్ణయించింది. 1.50 ఎకరాల విస్తీర్ణంలోని ఈ చారిత్రక బౌలి పునరుద్ధరణను వారసత్వ పరిరక్షణ, పర్యావరణ అభివృద్ధి, ప్రజా ప్రయోజనం అనే మూడు అంశాలను సమన్వయం చేసే కార్యక్రమంగా హైడ్రా భావించింది. నిర్లక్ష్యానికి గురైన చారిత్రక ఆస్తిని తిరిగి ప్రజలకు అందివ్వడం.. పర్యావరణానికి ఉపయోగపడేలా చూడడమే ఈ బావి పునరుద్ధరణ ముఖ్య ఉద్దేశం. నగర చారిత్రక జల నిర్వహణ పద్ధతులను పౌరులు, విద్యార్థులు, భవిష్యత్ తరాలు తెలుసుకుని, అర్థం చేసుకునే అవకాశాన్ని హైడ్రా కల్పిస్తోంది. ఇటీవలే పనులు మొదలయ్యాయి. రెండు మూడు నెలల్లో ఈ పనులు పూర్తయి.. ఊటబావిలోకి పుష్కలంగా నీరు రానుంది. × ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డి గారి ఆదేశాల మేరకు..ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డి గారు బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువును మార్చి నెల 8వ తేదీన ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. అప్పుడే ఈ చెరువుకు ఆనుకుని ఉన్న చారిత్రక బావి విషయాన్ని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డిగారి దృష్టికి తీసుకెళ్లారు. వెనువెంటనే అభివృద్ధికి అడుగులు పడ్డాయి. చెరువు అభివృద్ధి పనులను పర్యవేక్షించిన విమోస్ టెక్నోక్రాట్స్ సంస్థనే ఇప్పుడు చెరువు కింద ఉన్న చారిత్రక బావి పునర్నిర్మాణాన్ని కూడా చేపట్టింది. నిజాంల కాలంలో పాలకులకు ఔషధ గుణాలున్న తాగునీరందించిన చెరువుతో పాటు కిందన ఉన్న ఊట బావి కాలగర్భంలో కలిసిపోతున్న తరుణంలో హైడ్రా చరిత్రను తవ్వితీసిన విషయం అందరికీ విదితమే. 100 ఎకరాల మేర విస్తరించి ఉన్న ఈ చెరువు కబ్జాలకు గురైంది. చివరకు 4 ఎకరాలకు పరిమితమైంది. హెచ్ ఎం డీ ఏ లెక్కల ప్రకారం 17 ఎకరాలు కగా ఆ మేరకు ఆక్రమణలను తొలగించి చెరువుకు హైడ్రా జీవం పోసింది. మట్టితో నింపేసి లే ఔట్‌గా మార్చిన తరుణంలో.. కబ్జాలను తొలగించి చెరువును తవ్వి తీసింది. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. ఇప్పుడు ఊట బావిని కూడా పునరుద్ధరిస్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త, మట్టి, ఒండ్రుమట్టి (స్లష్), దట్టమైన పిచ్చి మొక్కలతో నీటిని నిల్వ చేసే సామర్థ్యం కోల్పోయిన ఊట బావిని తవ్వి చరిత్రకు జీవం పోస్తోంది హైడ్రా. × చరిత్రం ఎంతో ఘనం.. హైడ్రాతో భావి తరాలకది సజీవంచారిత్రక నగరంలో ఎన్నో పురాతన బావిలున్నాయి. ఒక్కో బావిది ఒక్కో చరిత్ర అయితే బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు కింద ఉన్న బావికి కూడా చాలా పేరుంది. ఈ ఊట బావిలో నీరు ఔషధ గుణాలుండేవని.. నిజాం పాలకులు ఆ నీటినే తాగేవారని చెబుతుంటారు. బుమ్-రుక్న్-ఉద్-దౌలా సరస్సు కేవలం ఒక జలవనరు మాత్రమే కాదు.. నగర ప్రజల వారసత్వ సంపద. మూడవ నిజాం సికందర్ జా పాలనా కాలంలో.. సుమారు 1770 ప్రాంతంలో ఈ సరస్సును నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఆ కాలంలో ప్రధానమంత్రిగా ఉన్న నవాబ్ రుక్న్-ఉద్-దౌలా పేరుమీదుగా ఈ సరస్సుకు పేరు వచ్చినట్లు చారిత్రక సమాచారం. దాదాపు 100 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ సరస్సు కట్ట, పరిసరాల్లోని ఔషధ మొక్కల ద్వారా నీరు సహజంగా వడపోతకు గురై బౌలిలోకి చేరేదని, అక్కడి నీరు స్వచ్ఛతతో పాటు ఔషధ గుణాలకు కూడా విలువైనదిగా భావించేవారని చెబుతారు. ఔషధ గుణాలున్న ఈ నీటిని ఎడ్ల బండ్ల ద్వారా సుదూర ప్రాంతాలకు తరలించేవారని, చివరకు లండన్ వరకు కూడా ఈ నీటికి సంబంధించిన ప్రయాణం జరిగినట్లు కథనాలు ఉన్నాయి. చెరువులో ఔషధ గుణాలున్న చెట్ల కొమ్మలు, బెరడలు, పూలు వేసి.. ఉంచడం. చెరువు కింద ఉన్న ఊట బావిలోకి వచ్చిన ఆ నీటిలో ఔషధ గుణాలుండేవని చరిత్ర చెబుతోంది. బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు, ఔషధ మొక్కలు, పురాతన బౌలి.. ఇవన్నీ కలిసి హైదరాబాద్‌లో నీటి సంరక్షణ, సహజ వడపోత, ప్రకృతి ఆధారిత వైద్య విధానాలపై ఉన్న సంప్రదాయ జ్ఞానానికి ఒక అద్భుతమైన ఉదాహరణగా నిలుస్తాయి. బుమ్-రుక్న్-ఉద్-దౌలా వారసత్వాన్ని పరిరక్షించడం అంటే కేవలం ఒక సరస్సును కాపాడటమే కాదు.. నీరు, ప్రకృతి, వైద్యం, నిజాం రాజవంశ చరిత్రతో ముడిపడిన శతాబ్దాల నాటి వారసత్వాన్ని పరిరక్షించడంగా హైడ్రా బావిస్తోంది.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఇద్దరు అధికారులు

### రూ.75 వేల లంచం డిమాండ్..
### స్వీకరిస్తుండగా పట్టివేత
### టౌన్ ప్లానింగ్ అధికారి, సీనియర్ అసిస్టెంట్‌పై కేసు నమోదు



మొయినాబాద్: మొయినాబాద్ మున్సిపాలిటీలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం నిర్వహించిన ట్రాప్‌లో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (ఎ-1), సీనియర్ అసిస్టెంట్ (ఎ-2) పట్టుబడ్డారు. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం.. మొయినాబాద్ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ గుండు వాణి, ఫిర్యాదుదారుడి నిర్మాణాన్ని చట్టవిరుద్ధమైనదిగా పరిగణించి, దానిపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా అధికారిక సహాయం చేస్తానని చెప్పినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో మొయినాబాద్ గ్రామ పంచాయతీ మాజీ కార్యదర్శి, ప్రస్తుతం మొయినాబాద్ మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్‌గా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న యలమోని సుదర్శన్ (ఎ-2) ద్వారా ఫిర్యాదుదారుడి నుంచి రూ.75,000 లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది. సెప్టెంబర్ 30న లంచం మొత్తాన్ని స్వీకరిస్తుండగా సిటీ రేంజ్-2 ఏసీబీ అధికారులు ట్రాప్ నిర్వహించి ఇద్దరినీ పట్టుకున్నట్లు వెల్లడించారు. ఎ-2 సూచన మేరకు అతని స్వాధీనం నుంచి రూ.75,000 లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. నిందితులైన ఎ-1, ఎ-2 తమ విధులను సక్రమంగా, నిజాయితీగా నిర్వహించకుండా అక్రమ ప్రయోజనం పొందేందుకు వ్యవహరించినట్లు ఏసీబీ పేర్కొంది. ఇద్దరు నిందితులను జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం నాంపల్లిలోని ఎస్పీఈ & ఏసీబీ కేసుల గౌరవనీయ మొదటి అదనపు ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తున్నట్లు అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు.

## సాదిక్ ఖాన్‌కు మరోసారి పోలీస్ కస్టడీ

సర్వవరం సాదిక్ ఖాన్‌కు మరోసారి పోలీస్ కస్టడీపిఈ సూకరాజు కుటుంబం ఆత్మహత్య, జగదీశ్వరరెడ్డి హత్య కేసుల్లో నిందితుడు సాదిక్ ఖాన్‌ను రెండోసారి పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతించింది. కోర్టు ఆదేశాల మేరకు సర్వవరం సీఐ సిహెచ్. ప్రకాష్ ఆధ్వర్యంలో పోలీసులు సాదిక్ ఖాన్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.గతంలో మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీలో ఉన్న సమయంలో సాదిక్ ఖాన్ దర్యాప్తుకు పూర్తిస్థాయిలో సహకరించలేదని పోలీసులు కోర్టుకు తెలిపారు. కేసుల దర్యాప్తులో మరింత సమాచారం రాబట్టాల్సి ఉందని పేర్కొంటూ పోలీసులు మరోసారి కస్టడీకి అనుమతి కోరారు.పోలీసుల అభ్యర్థనను పరిశీలించిన కోర్టు సాదిక్ ఖాన్‌కు రెండు రోజుల పోలీస్ కస్టడీ మంజూరు చేసింది. ఈ కస్టడీ సమయంలో కేసులకు సంబంధించిన మరిన్ని వివరాలను పోలీసులు సేకరించనున్నట్లు సమాచారం.

# పెట్టుబడి పేరుతో పంజా విసురుతున్న సైబర్ నేరగాళ్లు

### తెలంగాణలో సైబర్ మోసాల నష్టాల్లో 60 శాతం పెట్టుబడి మోసాలే... దేశవ్యాప్తంగా పెరుగుతున్న డిజిటల్ మోసాల ముప్పు

(హెచ్.ప్రతాప్)

డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో సైబర్ నేరాలు దేశవ్యాప్తంగా కొత్త సవాల్‌గా మారుతున్నాయి. ఒకప్పుడు బ్యాంకు ఓటీపీలు, లాటరీ సందేశాలకే పరిమితమైన మోసాలు ఇప్పుడు స్టాక్ మార్కెట్, క్రిప్టో కరెన్సీ, ఆన్‌లైన్ ట్రేడింగ్, అధిక లాభాల పెట్టుబడుల పేరుతో భారీ స్థాయిలో సాగుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణలో నమోదవుతున్న సైబర్ మోసాల ఆర్థిక నష్టాల్లో దాదాపు 60 శాతం స్టాక్ ట్రేడింగ్, పెట్టుబడి సంబంధిత మోసాల వల్లే జరుగుతున్నట్లు సైబర్ భద్రతా సంస్థల విశ్లేషణలు వెల్లడిస్తున్నాయి.

దేశవ్యాప్తంగా సైబర్ నేరాల తీవ్రతను చూస్తే పరిస్థితి మరింత ఆందోళనకరంగా కనిపిస్తోంది. జాతీయ నేర రికార్డుల బ్యూరో గణాంకాల ప్రకారం 2024లో భారత్‌లో 1,01,928 సైబర్ నేర కేసులు నమోదయ్యాయి. 2023లో నమోదైన 86,420 కేసులతో పోలిస్తే ఇది దాదాపు 17.9 శాతం పెరుగుదల. ఈ కేసుల్లో 73,987 కేసులు అంటే 72.6 శాతం ఆర్థిక మోసాలకు సంబంధించినవే కావడం గమనార్హం.

తెలంగాణలో పెట్టుబడి మోసాలు ప్రత్యేకంగా పెరుగుతున్నాయి. నకిలీ ట్రేడింగ్ యాప్‌లు, వాట్సాప్ ఇన్వెస్ట్‌మెంట్ గ్రూపులు, టెలిగ్రామ్ ఛానళ్లు, సోషల్ మీడియా ప్రకటనల ద్వారా భారీ లాభాల ఆశ చూపిస్తూ మోసగాళ్లు ప్రజల సొమ్మును కొల్లగొడుతున్నారు. తక్కువ కాలంలో డబ్బు రెట్టింపు అవుతుందని, ప్రత్యేక షేర్లలో పెట్టుబడి పెడితే భారీ రాబడులు వస్తాయని నమ్మించి లక్షల రూపాయలు కాజేస్తున్నారు. చాలామంది బాధితులు తమ డబ్బును స్వయంగా బదిలీ చేయడం వల్ల తర్వాత డబ్బు తిరిగి పొందడం కష్టంగా మారుతోంది.

సైబర్ నేర ముఠాలు ఇప్పుడు స్థానిక స్థాయిని దాటి అంతర్జాతీయ నెట్‌వర్క్‌లుగా మారాయి. వియత్నాం, మయన్మార్, కాంబోడియా వంటి దేశాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసుకొని వివిధ దేశాల ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. స్థానిక భాషలు మాట్లాడగల సిబ్బందితో ఆధునిక కాల్ సెంటర్లను నిర్వహిస్తూ బాధితుల విశ్వాసాన్ని సంపాదించి మోసాలకు పాల్పడుతున్నాయి. నేరగాళ్లు సాంకేతికత కంటే మానవ బలహీనతలను ఎక్కువగా వినియోగిస్తున్నారని భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు. భయం, అత్యాశ, అమాయకత్వం, త్వరగా ధనవంతులు కావాలనే కోరిక వంటి అంశాలనే వారు ప్రధాన ఆయుధాలుగా మార్చుకుంటున్నారు.

అయితే తెలంగాణలో సైబర్ నేరాల నియంత్రణలో కొన్ని సానుకూల ఫలితాలు కనిపిస్తున్నాయి. గత రెండేళ్లలో సైబర్ మోసగాళ్ల చేతిలో పోయిన సొమ్ములో రూ.455 కోట్లకు పైగా తిరిగి రికవరీ చేయడం విశేషం. అలాగే 2025లో దేశవ్యాప్తంగా సైబర్ నేర ఫిర్యాదులు 24 శాతం పెరిగినప్పటికీ తెలంగాణలో ఫిర్యాదులు 3 శాతం తగ్గాయి. రాష్ట్రంలో ఆర్థిక నష్టాలు 20.2 శాతం తగ్గగా, 2026 తొలి అర్ధభాగంలో ఫిర్యాదులు 10.2 శాతం, ఆర్థిక నష్టాలు 26.8 శాతం తగ్గినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. నిలిపివేసిన (హోల్డ్ చేసిన) నిధుల శాతం 21 నుంచి 29 శాతానికి పెరగడం కూడా గమనార్హం.

పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉంది. 2025లో అక్కడ 62 వేలకుపైగా సైబర్ ఫిర్యాదులు నమోదుకాగా, 2,332 కేసులు నమోదు చేశారు. సైబర్ నేరాల వల్ల ప్రజలు సుమారు రూ.815 కోట్లు కోల్పోయినట్లు అధికార గణాంకాలు వెల్లడించాయి. అందులో డిజిటల్ అరెస్ట్, పెట్టుబడి మోసాలు, ఆన్‌లైన్ ఫైనాన్షియల్ ఫ్రాడ్లు ప్రధాన వాటాగా ఉన్నాయి.

నిపుణుల అభిప్రాయం ప్రకారం సైబర్ నేరాల్లో ఎక్కువ భాగం నివారించగలిగేవే. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకపోవడం, ధృవీకరణ లేని పెట్టుబడి పథకాలపై నమ్మకం పెట్టుకోకపోవడం, సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చిన ఆర్థిక సలహాలను వెంటనే అనుసరించకపోవడం, మోసం జరిగిన తొలి గంటలోనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయడం ద్వారా నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చు. డిజిటల్ యుగంలో సాంకేతికత ఎంత ముఖ్యమో, అప్రమత్తత కూడా అంతే ముఖ్యమని తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

# జర్నలిస్టులపై దాడులు, దౌర్జన్యాల కేసుల పరిశీలనకు హైపవర్ కమిటీ

### ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం

అమరావతి అక్టోబర్1: జర్నలిస్టులపై దాడులు, దౌర్జన్యాల కేసుల పరిశీలనకు హైపవర్ కమిటీని వేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రెండేళ్ల కాలానికి హైపవర్ కమిటీకి హోంమంత్రి చైర్మన్‌గా.. ఐఅండ్‌పీఆర్ మంత్రి వైస్‌చైర్మన్‌గా వ్యవహరిస్తారు. హోంశాఖ, జీఏ, ఐఅండ్‌పీఆర్ శాఖల ఉన్నతాధికారులకు కమిటీలో చోటు ఐజీ లా అండ్ ఆర్డర్ కూడా కమిటీలో సభ్యుడిగా నియామకం మూడు గుర్తింపు పొందిన జర్నలిస్టు సంఘాల ప్రతినిధులకు కమిటీలో చోటు ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులకు సభ్యత్వం




ఐఅండ్‌పీఆర్ డైరెక్టర్ సభ్య కన్వీనర్‌గా వ్యవహరణ అవసరాన్ని బట్టి అదనపు సభ్యుడిని కో-ఆప్ట్ చేసే అవకాశం

# ఎమ్మెల్సీ ఎన్నికలు సాధారణ ఎన్నికలకు సెమీఫైనల్స్ లాంటివే : సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి



మహబూబ్‌నగర్ : రాష్ట్రంలో రెండు చోట్ల జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలు సాధారణ ఎన్నికలకు సెమీఫైనల్స్‌గానే భావిస్తున్నామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, పాలమూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన బీఆర్ఎస్ శ్రేణులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బాధ్యతగా వ్యవహరించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశం చేశారు. ఉద్యోగులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం వల్ల వారిలో ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వెల్లడించారు. పట్టభద్రులు అందరూ తాజాగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. పార్టీ శ్రేణులు గ్రామ, గ్రామాన పట్టభద్రులను కలిసి ఓటు నమోదు చేయించాలని కోరారు. 43నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుందని వెల్లడించారు. ప్రభుత్వంపై అన్ని వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్న దృష్ట్యా గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. అభ్యర్థి విషయంలో పార్టీ నిర్ణయం శిరోధార్యమని అన్నారు. ఎమ్మెల్సీ విజయంతో ప్రభుత్వానికి చెంప చెల్లుమనిపించేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యం లో ఘనంగా కోటి పార్థివలింగార్చన మహోత్సవం..



హైదరాబాద్ అక్టోబర్ 1:ఆర్యవైశ్య సంఘం పురాణాపూల్ కార్పొరేటర్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య భవన ప్రాంగణంలో కోటి పార్థివలింగార్చన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మహిళా భక్తులు శాస్త్రోక్తంగా దీపారాధన, కలశస్థాపన, గణపతి పూజ, గౌరీపూజ, నవగ్రహ ఆరాధన నిర్వహించారు.

అనంతరం భక్తులు పుట్టమన్నుతో 108 పార్థివ లింగాలను స్వయంగా తయారు చేసిపంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, భస్మార్చన, పుష్పార్చన, బిల్వార్చనలతో విశేష పూజలు జరిపించారు. కార్యక్రమంలో పూజాదికాలు నిర్వహించిన బాసర అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికానాథ శర్మ మాట్లాడుతూ.. బాసర క్షేత్రంలోని ద్వాదశ జ్యోతిర్లింగ దేవాలయం ఈశాన్య భాగంలో కోటి పార్థివలింగ స్థూపాన్ని నిర్మించామని తెలిపారు.

భక్తులు తయారు చేసిన ఈ శివలింగాలను ఆ స్థూపంలో నిక్షిప్తం చేయనున్నట్లు పేర్కొన్నారు. పార్థివ శివ లింగాల తయారీకి ఆసక్తి గల మహిళా బృందాలు 9948332032 నంబరును సంప్రదిస్తే ఉచితంగా పుట్టమన్నును అందజేసి పూజాదికాలు చేయిస్తామని వెల్లడించారు.

బాసర సరస్వతి క్షేత్రం లో మాసోత్సవం సందర్భంగా 25న ప్రత్యేక పూజలు ,హోమములు ,గో పూజ, మహా అన్నదానం ,మరియు భరతనాట్యము కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించనున్నామని ఆసక్తిగల నాట్యగురువులు 9948332032 సంప్రదించి తమ పేరు నమోదు చేసుకోవాలని కోరారు. ఆర్యవైశ్య సంఘంఅధ్యక్షులు మేడమ్ గోవిందరాజు మరియు కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రదోషకాల శివార్చన చేయడం ఎంతో ఆనందంగా ఉందని మరియు ఈ సామూహిక పార్థివలింగార్చన కార్యక్రమం తమ వివిధ ప్రాంతాలలో గల వాసవి వనిత క్లబ్ సభ్యులకు మరియు ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యులందరికీ చెప్పి వారి అందరితో ఈ కార్యక్రమం చేయిస్తామని అన్నారు. శివ శ్రీ నిర్మల అంబికానాథ శర్మ సంఘ అధ్యక్షులు మేడం గోవిందరాజును అభినందిస్తూ దేవాలయ ఛాయాచిత్రం మరియు శేష వస్త్రం బహుకరించినారు. ఈ కార్యక్రమంలో గీతా రాణి ,పద్మ ,తదితరులు పాల్గొన్నారు .

# అనాథ వృద్ధులకు అమ్మలా మదర్ థెరిసా సేవా సంస్థ



రుద్రంపూర్, అక్టోబర్ 01 : వృద్ధాప్యంలో ఆదరణ కోల్పోయిన వారికి అండగా నిలవడం, వారి ముఖాల్లో చిరునవ్వులు చూడడమే నిజమైన మానవత్వమని చాటుతూ రుద్రంపూర్‌లో మదర్ థెరిసా సేవా సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనాథలు, ఆదరణకు నోచుకోని వృద్ధులను చేరదీసి వారికి ప్రత్యేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. మదర్ థెరిసా సేవా సంస్థ అధ్యక్షుల ఆధ్వర్యంలో వృద్ధులకు క్షవరం, కటింగ్ చేయించి, శుభ్రంగా స్నానం చేయించారు. అనంతరం వారికి నూతన వస్త్రాలను అందించి, స్వయంగా ధరింపజేశారు. వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. వృద్ధాప్యంలో శారీరకంగా, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి చిన్నపాటి సహాయం కూడా ఎంతో విలువైనదని నిర్వాహకులు పేర్కొన్నారు. కుటుంబాలకు దూరమై ఒంటరిగా జీవిస్తున్న వృద్ధులకు ఆప్యాయత, ప్రేమ, ఆదరణ కల్పించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వృద్ధుల అనుభవాలు, జీవిత పాఠాలు నేటి తరానికి ఎంతో విలువైనవని తెలిపారు. వృద్ధుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా వారికి అవసరమైన సమయంలో సహాయం అందించాలని, వృద్ధులను గౌరవించడం మన సంస్కృతిలో భాగమని పేర్కొన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం ద్వారా మానవత్వం, సేవాభావం చాటుకున్నామని నిర్వాహకులు తెలిపారు.

# పోషక విలువలతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం : ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిహారిక

నీలగిరి, అక్టోబర్ 01 : పోషక విలువలు ఉన్న ఆహారం క్రమం తప్పకుండా తీసుకుంటే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పౌష్టికాహారం ఎంతో కీలకమని నల్లగొండ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిహారిక అన్నారు. నల్లగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మన్యం సెక్టార్ 24వ డివిజన్‌లో గురువారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు సమతుల్య ఆహారం అవసరమని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడంతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రతి కుటుంబం అవగాహనతో ముందుకు రావాలని నిహారిక సూచించారు. పోషణ మాసం సందర్భంగా ప్రజల్లో పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ప్రమీల, ప్రేమలత, షాహిదా, ఆశా వర్కర్ సువర్ణ, ఆర్పీ అండాలు పాల్గొన్నారు.

# కేటీఆర్ 8 వేల ఎకరాల కబ్జా ఆరోపణలపై ఎవిడెన్స్ ఏది..

### రేవంత్‌ను ప్రశ్నించిన ఎమ్మెల్యే గంగుల



ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ 10 సంవత్సరాల్లో చాలాసార్లు కరీంనగర్ జిల్లాకు వచ్చారు. ఎప్పుడొచ్చినా కూడా కరీంనగర్ జిల్లాకు నిధుల వరదను తీసుకొచ్చి ఈ జిల్లాను రాష్ట్రంలోనే గొప్ప జిల్లాగా తీర్చిదిద్దారని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. సిరిసిల్లలో బీఆర్ఎస్ నేతలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లాకు కేసీఆర్ ఎట్ల నిధులిచ్చారో.. నిన్న రేవంత్ వస్తున్నరు కదా నిధులిస్తడని భావించాం. 10 సంవత్సరాలు అభివృద్ధి పథంలో నడిపిస్తే నిన్న వచ్చిన రేవంత్ రెడ్డి ఆరోపణలు, విధ్వంసం, వ్యక్తిగత దూషణలకు పరిమితమైందని మండిపడ్డారు. వ్యక్తిగతంగా ఎందుకు దాడి చేస్తుందని అడిగితే.. ప్రభుత్వంలో ఏం చేయనీకి చేతనైతలేదని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఫైర్ అయ్యారు. ప్రజలు 1000 రోజులు పరిపాలనలో తీవ్రంగా నిరసిస్తుంటే.. డైవర్షన్ పాలిటిక్స్ చేయాలే. లేనిపోని ఆరోపణలు చేయడం, వ్యక్తిగత విమర్శలు చేయడం.. ఇది ఈ ముఖ్యమంత్రికి అలవాటైపోయింది.. మేం కూడా 15-16 సంవత్సరాలుగా నలుగురైదుగురు ముఖ్యమంత్రులను చూసినం. కేటీఆర్ 8 వేల ఎకరాలు కబ్జా చేశారు, సిరిసిల్లకు వస్తూ దానిపై ఎవిడెన్స్ తెస్తానని రేవంత్ రెడ్డి చాలా సార్లు అన్నాడు.. వచ్చేటప్పుడు తెస్తా అన్నఎవిడెన్స్ ఏది అని ప్రశ్నించారు. నిన్న రేవంత్ రెడ్డి వచ్చిపోయింతర్వాత బూటకమని తేలిపోయిందన్నారు. 1000 రోజులు పరిపాలనలో 420 హామీలైతే ఎలా బూటకమో.. ఎవిడెన్స్ తేలేకపోయిన్రు కాబట్టి కేటీఆర్ మీద చేసిన ఆరోపణలు కూడా బూటకమని నిన్న తేలిపోయిందని పేర్కొన్నారు.

# ఒంగోలు ఉత్సవానికి హాజరయిన వెంకయ్య నాయుడు

ఒంగోలు మున్సిపాలిటీ ఏర్పడి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఒంగోలు ఉత్సవం ఘనంగా జరిగింది. స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఒంగోలుతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని వెంకయ్యనాయుడు గుర్తు చేసుకున్నారు. 1977లో ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గం నుంచే తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందన్నారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన సమయంలో ఒంగోలు ప్రజలు తనకు అండగా నిలిచారని తెలిపారు. నాటి రాజకీయాల్లో ప్రజలే స్వచ్ఛందంగా నిధులు సమకూర్చారని గుర్తుచేశారు. రాజకీయాల్లో ధనబలం, కుల, ప్రాంతీయ భేదాల కంటే వ్యక్తిత్వం, సామర్థ్యం, నడవడిక ముఖ్యమని సూచించారు.

# కోల్ బెల్ట్ లో మోసం స్కీం ల దందా

### పెట్టుబడుల పేరుతో లక్షలాది రూపాయల మోసాలు.. ఆశ చూపి అందినకాడికి దోపిడీ.!

### ప్రజల కష్టార్జిత సొమ్ముపై మోసగాళ్ల కన్ను

**పెద్దపల్లి, అక్టోబర్-1, ప్రజాబలం ప్రతినిధి:** తక్కువ పెట్టుబడి పెట్టండి.! ఎక్కువ లాభాలు పొందండి! పెట్టిన డబ్బులు కొద్ది రోజుల్లోనే రెట్టింపు అవుతాయి! నెలనెలా భారీ ఆదాయం మీ సొంతమవుతుంది! ఇలాంటి ఆకర్షణీయమైన మాటలు వినిపిస్తున్నాయా.? అయితే ఒక్క క్షణం ఆలోచించండి.!

మీకు లాభాలు చూపిస్తున్నది నిజమైన పెట్టుబడి పథకమా? లేక మీ కష్టార్జిత సొమ్మును కాజేసే మోసపూరిత దందానా? స్కీములు అధిక పెట్టుబడులు, ఆన్‌లైన్ ట్రేడింగ్, క్రిప్టో పెట్టుబడులు, ల్యాండ్ సేల్ స్కీం లు, డబుల్ మనీ పథకాల పేరుతో ప్రజలను ఆకర్షించే మోసపూరిత వ్యవహారాలపై ప్రత్యేక కథనం..

ప్రజల ఆర్థిక అవసరాలు, అత్యాశ, అత్యవసర పరిస్థితులను ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు, సంస్థలు వివిధ రకాల పెట్టుబడి పథకాల పేరుతో ప్రజలను ఆకర్షిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి డబ్బులు సేకరించడం, ప్రారంభంలో కొంతమందికి చెల్లింపులు చేసి మరింత మందిని పెట్టుబడుల వైపు మళ్లించడం వంటి పద్ధతులు కొన్ని మోసపూరిత పథకాలలో కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రోజువారీ ఆదాయం, నెలవారీ అధిక వడ్డీ, పెట్టుబడిపై రెట్టింపు మొత్తం, సభ్యులను చేరిస్తే కమీషన్లు అంటూ ప్రచారం చేస్తూ ప్రజలను ఆకర్షిస్తున్నారు. మొదట నమ్మకం కలిగించి, పెద్ద మొత్తంలో డబ్బులు సేకరించిన తర్వాత చెల్లింపులు నిలిపివేయడం, కార్యాలయాలు మూసివేయడం, నిర్వాహకులు అందుబాటులో లేకుండా పోవడం వంటి ఘటనలు చోటుచేసుకునే ప్రమాదం ఉంది.

ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో కొత్త తరహా మోసాలు.!

సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులు, టెలిగ్రామ్ ఛానళ్ల ద్వారా నకిలీ ట్రేడింగ్ లాభాలు చూపిస్తూ డబ్బులు జమ చేయించుకునే మోసాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలి. కానీ నకిలీ యాప్‌లలో లాభాలు వచ్చినట్లు చూపించి, ఆ మొత్తాన్ని ఉపసంహరించుకునే సమయంలో మరిన్ని ఛార్జీలు చెల్లించాలని కోరడం వంటి మోసపూరిత పద్ధతులతో ప్రజల కష్టార్జితం మోసగాళ్ళ చేతుల్లోకి వెళ్తోంది. రోజంతా కష్టపడి సంపాదించిన డబ్బును భవిష్యత్తు అవసరాల కోసం దాచుకునే మధ్యతరగతి కుటుంబాలు, చిరు వ్యాపారులు, కార్మికులు, ఉద్యోగులు ఇలాంటి పథకాల బారిన పడి నష్టపోతున్నట్లు సమాచారం. ఇలాంటి వాటిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




# అక్రమ ఇసుక లారీ పట్టివేత..

### 34 టన్నుల ఇసుక స్వాధీనం.. ఇద్దరిపై కేసు నమోదు.

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 1:** వేంసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనలో 34 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకుని, లారీని సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు.



ఎస్ఐ ప్రదీప్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 29న పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఎర్రగుంటపాడు--లంకపల్లి మార్గంలో అనుమానాస్పదంగా వెళ్తున్న TS 04 UE 6819 నంబర్ గల లారీని తనిఖీ చేశారు. లారీలో ఎలాంటి అనుమతులు లేకుండా ఏపీలోని కొవ్వూరు నుంచి తరలిస్తున్న 34 టన్నుల ఇసుక ఉన్నట్లు గుర్తించారు.

విచారణలో రేజర్లకు చెందిన లారీ యజమాని-కమ్-డ్రైవర్ కోనకళ్ల చందు, వీఎం బంజారాకు చెందిన మధ్యవర్తి బండారి చెన్నారావు కలిసి టన్ను రూ.1,200 చొప్పున అక్రమంగా ఇసుక విక్రయిస్తున్నట్లు తేలినట్లు పోలీసులు తెలిపారు.

పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి ఇసుకతో పాటు లారీని సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేయగా, లారీ యజమాని-కమ్-డ్రైవర్ కోనకళ్ల చందును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

మండల పరిధిలో ఎక్కడైనా అనుమతులు లేకుండా ఇసుకను తరలించినా, అక్రమంగా విక్రయించినా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

# రూపాయి ఎర.. రూ.50 వేల దోపిడీ!

### పుస్తకాలు కొంటానంటూ వచ్చి.. యూపీఐ పిన్ గమనించి.. సెల్‌ఫోన్‌తో ఉడాయింపు వేంసూరులో ఘరానా మోసం.. మూడు విడతల్లో ఖాతా ఖాళీ

రూపాయి పంపిస్తానని నమ్మించి.. యూపీఐ పిన్ తెలుసుకుని.. సెల్‌ఫోన్ అపహరించి ఏకంగా రూ.50 వేలు కాజేశాడు ఓ కేటుగాడు. వేంసూరు సెంటర్‌లోని ఓ పుస్తకాల దుకాణంలో గురువారం వెలుగుచూసిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పుస్తకాలు కొనుగోలు చేస్తానంటూ గుర్తుతెలియని వ్యక్తి దుకాణానికి వచ్చాడు. పుస్తకాలు చూపిస్తున్న సమయంలో తన స్నేహితుడికి ఫోన్‌పే ద్వారా రూ.1 పంపాలని, వెంటనే తిరిగి పంపిస్తానని దుకాణదారుడిని నమ్మించాడు. దీంతో దుకాణదారుడు తన మొబైల్‌లో యూపీఐ పిన్ నమోదు చేయగా.. నిందితుడు ఆ పిన్‌ను చాకచక్యంగా గమనించినట్లు బాధితుడు తెలిపాడు.

కొద్దిసేపటి తర్వాత మరిన్ని పుస్తకాలు కావాలని చెప్పడంతో దుకాణదారుడి భార్య లోపలికి వెళ్లగా, దుకాణదారుడు కూడా పక్కనే ఉన్న మరో షాపు వద్దకు వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన నిందితుడు కౌంటర్‌పై ఉన్న స్మార్ట్‌ఫోన్‌ను తీసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు.




ఫోన్ కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన దుకాణదారుడు వెంటనే బ్యాంకును సంప్రదించాడు. అప్పటికే నిందితుడు ముందుగా తెలుసుకున్న యూపీఐ పిన్‌ను ఉపయోగించి ఖాతా నుంచి రూ.20 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు చొప్పున మూడు విడతల్లో మొత్తం రూ.50 వేలు బదిలీ చేసినట్లు గుర్తించారు.

అప్రమత్తమైన బాధితుడు వెంటనే బ్యాంకు అధికారులను సంప్రదించి ఖాతాను బ్లాక్ చేయించడంతో ఖాతాలో ఉన్న మరో రూ.30 వేలు సురక్షితంగా మిగిలాయి. బ్యాంకు ఖాతాతో అనుసంధానమైన ఫోన్ నంబర్లను సంప్రదించగా, అవి కాకినాడ ప్రాంతానికి చెందినవిగా గుర్తించినట్లు బాధితుడు తెలిపాడు.

ఈ ఘటనపై బాధితుడు వేంసూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యూపీఐ పిన్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి

తెలియని వ్యక్తులు చెప్పే చిన్న మొత్తాల లావాదేవీల పేరుతో యూపీఐ పిన్, ఓటీపీ వంటి రహస్య వివరాలను ఇతరులు గమనించే అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తపడాలని పోలీసులు సూచిస్తున్నారు.

# మహిళా, శిశు, సంక్షేమశీ, విద్య వైద్య రంగాలకు ఎంతో ప్రాధాన్యత

### మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడి

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 01 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, (సిడబ్ల్యుసి) సభ్యులు శ్రీ దామోదర్ రాజనర్సింహను, (ఏఐసిసి ) సెక్రెటరీ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ పార్టీ, వ్యవహారాల ఇన్చార్జి, ఎం, ఎస్, మయూరిసింగ్, హైదరాబాద్ లోని, మంత్రి నివాసంలోమర్యాదపూర్వకంగా కలిశారు రాష్ట్రంలో మహిళా సాధికారిత కోసం, ప్రజా ప్రభుత్వం చేస్తున్న కృషి, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై, చర్చించారు, రాష్ట్ర ప్రభుత్వం మహిళా, శిశు, సంక్షేమం, విద్య,వైద్య, రంగాలకు, ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు, సంక్షేమ కార్యక్రమాలను, ప్రజల్లోకి పెద్ద ఎత్తున తీసుకెళ్లడం మహిళా కాంగ్రెస్ బలోపేతం పై చర్చించారు....



# తెలంగాణ ప్రభుత్వ హయాంలోనే బతుకమ్మ పండుగ విశిష్టత మరింత పెరిగింది



**సనత్ నగర్ (ప్రజాబలం ప్రతినిధి నరేష్ )అక్టోబర్ 1** గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సనత్‌నగర్‌లోని జెక్ కాలనీకి చెందిన మహిళా వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కలిసి, 18వ తేదీన జెక్ కాలనీలో నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకలకు రావాలని ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 9 రోజుల పాటు మహిళలు బతుకమ్మను ఎంతో భక్తి శ్రద్ధలతో గొప్పగా జరుపుకుంటారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం బతుకమ్మ పండుగను రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ ప్రాంతంలో పుట్టిన బతుకమ్మ పండుగ నేడు విశ్వవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నారని, ఇది నిజంగా మనకు గర్వకారణం అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో కూడా పలు ప్రధాన కూడళ్లలో నిర్వహించే బతుకమ్మ వేడుకలకు మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని గుర్తు చేశారు.కార్యక్రమంలో అధ్యక్షురాలు ప్రభారెడ్డి, ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ, ఉపాధ్యక్షులు భాగ్యలత, అమరావతి, సృజన, హైమవతి తదితరులు ఉన్నారు.

# గురుకుల పాఠశాలలో జోనల్ ఆఫీసర్ అపర్ణ ఆకస్మిక తనిఖీ



కారేపల్లి, అక్టోబర్ 01 : కారేపల్లిలోని శ్రీ కవిత ఇంజినీరింగ్ కళాశాల భవన్ లో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలను భద్రాద్రి జోన్ జోనల్ అధికారి పి.అపర్ణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడిన ఆమె విద్య బోధన, వసతి, భోజనం, ఆరోగ్యం, మౌలిక సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నట్లు విద్యార్థినులు తెలిపారు. అనంతరం పరీక్షల నిర్వహణను పరిశీలించిన జోనల్ ఆఫీసర్ పరీక్షలు సక్రమంగా జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. డైనింగ్ హాల్, కిచెన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత, పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. క్యాంపస్ పరిసరాల్లో పెరిగిన గడ్డిని తొలగించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థినులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని నిరంతరం కల్పించాలని పేర్కొన్నారు.

# పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలి

### పంచాయతీ కార్యదర్శి గ్రామ సర్పంచ్ కుమ్మక్కై...
### చేసిన పనులు కొంచెం .. పంచాయతీ ఖర్చులు కొండంత!
### టీఆర్ఎస్ సీనియర్ నాయకులు దండు ప్రశాంత్ తేజ




చేసిన పనులు కొంచెం ఖర్చు కొండంత.. పంచాయతీ కార్యదర్శి గ్రామ సర్పంచ్ మోహన్ కుమ్మక్కై ఎవరికి దోచునంత వారు ఇష్టానుసారంగా గ్రామపంచాయతీ నిధులను డ్రా చేసుకొనిచున్నారు.కొల్చారం మండలం వరిగుంతం గ్రామపంచాయతీలో నిధుల వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టాలని టీఆర్ఎస్ యువ నాయకుడు దండు ప్రశాంత్ తేజ డిమాండ్ చేశారు. గ్రామంలో పనులు చేపట్టకుండానే చేపట్టినట్లు చూపిస్తూ పంచాయతీ నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆగస్టు 1, 2026న ఖర్చు వివరాలు పేర్కొనకుండా సరస్వతి పేరుతో రూ.1,23,281, ఆగస్టు 4న పుట్లగళ్ల సువర్ణ పేరుతో రూ.1,83,089 డ్రా చేసినట్లు ఆరోపించారు. గ్రామంలో ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేసినట్లు చూపిస్తూ ఆగస్టు 4న రూ.1,25,721, సెప్టెంబర్ 22న ఎల్ఈడీ బల్బులు, క్లాంపులు, వైర్ కొనుగోలు చేసినట్లు చూపిస్తూ రూ.44,900 డ్రా చేశారని తెలిపారు.

అదేవిధంగా ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో మోటార్ రిపేర్, పారిశుధ్య వాహనం డీజిల్ ఛార్జీలు, పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులు, గడ్డి మందు పిచికారీ తదితర పనుల పేరుతో పుట్లగళ్ల సువర్ణ పేరుపై రూ.1,25,454 డ్రా చేసినట్లు ప్రశాంత్ తేజ ఆరోపించారు. పనులు చేపట్టకుండానే తప్పుడు లెక్కలు చూపిస్తూ పంచాయతీ నిధులు ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు.

ఈ విషయాన్ని ప్రజావాణిలో ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు వరిగుంతం గ్రామాన్ని సందర్శించి పంచాయతీ నిధుల వినియోగంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని, ఆరోపణలు వాస్తవమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని దండు ప్రశాంత్ తేజ విజ్ఞప్తి చేశారు.

# వృద్ధుల అనుభవమే సమాజానికి మార్గదర్శకం

## జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 01 2026 కలెక్టరేట్**అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం--2026ను పురస్కరించుకొని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు మాట్లాడుతూ వయస్సు శరీరానికి మాత్రమేనని, మనసుకు వయస్సుతో సంబంధం లేదని పేర్కొన్నారు. ప్రజలందరి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు రూపొందించి సంక్షేమ పాలన అందిస్తోందన్నారు. వయోవృద్ధులు డే కేర్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం వారికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని తెలిపారు.

వయోవృద్ధ మహిళలు ప్రత్యేక మహిళా సంఘాల్లో చేరి ప్రభుత్వ పథకాలు, సంఘ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కుటుంబ సభ్యులు వృద్ధులను ప్రేమాభిమానాలతో చూసుకోవాలని, వారి ఆరోగ్యం, భద్రత, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థకు వృద్ధులే బలమైన పునాదులని అన్నారు. వారి అనుభవాలు, సలహాలు భావితరాలకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. వయోవృద్ధులను గౌరవంగా చూసుకుంటూ వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు.

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఆసియా షాహిన్ మాట్లాడుతూ తల్లిదండ్రులను సేవించడం, గౌరవించడం అన్నింటికంటే గొప్ప పూజ అని అన్నారు. వయోవృద్ధుల సంక్షేమం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని, వారు ఒంటరితనానికి గురికాకుండా కుటుంబ సభ్యులు ప్రేమాభిమానాలతో అండగా నిలవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వయోవృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనంతరం వయోవృద్ధుల సంక్షేమ ప్రతిజ్ఞ చేశారు. వయోవృద్ధులను ఘనంగా సన్మానించి, అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడల్లో విజేతలుగా నిలిచిన వయోవృద్ధులకు బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్, బీడబ్ల్యూఓ ప్రేమలత, ఏపీడీ శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రులను ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేయించాలి

### మంత్రివర్యులు సీతక్క గారి ఆదేశాల మేరకు జిల్లా పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్న గారి సూచన ప్రకారం
### కాంగ్రెస్ పార్టీ పట్ట బద్రుల అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి
### రాహుల్ గాంధీ గారిని దేశ ప్రధానిగా చేయడమే లక్ష్యంగా పనిచేయాలి
### ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 01 ఏటూర్ నాగారం** కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీలోకి తగిన గుర్తింపు..రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్లో నల్గొండ, వరంగల్ ఖమ్మం, స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి వారిని అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కంకణ బద్ధులై ఉండాలని కొత్తగా ఓటర్గా నమోదు చేసుకోను వారు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ లేదా తత్స మాన కోర్స్ పూర్తి చేసి ఉండాలి కట్- ఆఫ్

తేదీ 01- 11 -2023 నాటికి లేదా అంతకుముందు డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు .

01- 11- 2026 నాటికి అర్హత కలిగి ఉండాలని తెలిపారు

కావాల్సిన పత్రాల్లో రెండు పాస్ ఫోటో సైజ్- ఫోటోలు డిగ్రీ ఒరిజినల్ లేదా ప్రొవిజినల్ సర్టిఫికెట్ ఆధార్ కార్డు ఓటర్ గుర్తింపు కార్డు నివాసా ధ్రువీకరణ పత్రం ఉండాలి భారత ఎన్నికల సంఘం అధికారిక వెబ్సైట్లో ఫారం 18 - ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఆన్లైన్లో ఏటూర్ నాగారం తాసిల్దార్ కార్యాలయం లో పత్రాలతో ఫారం 18- సమర్పించవచ్చని తెలియజేశారు.

అయిన ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరినారు.ఓటర్లుగా పట్టభద్రులను నమోదు చేయించాలని ప్రతి గ్రామంలో పట్టణంలో ప్రతి వార్డులో పట్టభద్రులు ఎంతమంది ఉన్నారని తెలుసు కొని వారిని ఓటర్లుగా నమోదు చేయించి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

# గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం

### అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న లారీ..
### ధ్వంసమైన క్రాష్ బారియర్లు.. భారీ ఆస్తి నష్టం




**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 1 :** వేంసూర్ పరిధిలో చౌడారం వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవేపై గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అతివేగంగా వెళు_న్న ఓ భారీ లారీ అదుపుతప్పి రహదారి మధ్యలోని డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యూ-టర్న్ రైలింగ్‌తో పాటు మెటల్ బీమ్ క్రాష్ బారియర్లు (వీడీజడీ) పూర్తిగా ధ్వంసమై, భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది.

అధికారుల వివరాల ప్రకారం.. గురువారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. లారీ డ్రైవర్ మితిమీరిన వేగంతో వాహనాన్ని నడపడంతో ఒక్కసారిగా అదుపుతప్పింది. దీంతో లారీ నేరుగా డివైడర్ వైపు దూసుకెళ్లి యూ-టర్న్ రైలింగ్, మెటల్ బీమ్ క్రాష్ బారియర్‌ను ఢీకొట్టింది. ఢీకొన్న తీవ్రతకు రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన భద్రతా మౌలిక వసతులు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

సమాచారం అందుకున్న వెంటనే హైవే పెట్రోలింగ్, అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం కారణంగా ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా, తదుపరి ప్రమాదాలు చోటుచేసుకోకుండా రక్షణ చర్యలు చేపట్టారు. ధ్వంసమైన క్రాష్ బారియర్లు, పైప్‌లైన్లను పునరుద్ధరించేందుకు మెయింటెనెన్స్ విభాగం అధికారులు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం సంభవించిందా అనే వివరాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

# తుది దశకు చేరుకున్న కోడూర్ -- కొండారెడ్డిపల్లి రోడ్డు పనులు




**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 02 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :**ఆందోల్ మండలం కొండారెడ్డిపల్లి,ఎక్స్ రోడ్డు నుంచి పుల్కల్ మండలం కోడూర్, గ్రామం వరకు 6.70 కి.మీ,మేర చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. రూ.4.69, కోట్ల నిధులతో చేపట్టిన ఈ రోడ్డు నిర్మాణ పనులు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు శ్రీ దామోదర రాజనర్సింహ, కృషితోమంజూరయ్యాయి.రోడ్డు పనులు పూర్తయితే గ్రామాలమధ్య రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ప్రయాణ సమయం తగ్గడంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. వ్యవసాయం, విద్య, వైద్యం, వ్యాపార అవసరాల కోసం రాకపోకలు సులభతరం కావడంతో ఈ ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది.ప్రజల సౌకర్యమే లక్ష్యంగా... అభివృద్ధి పనులు వేగంగా ముందుకు,

# ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూనా్న పట్లోళ్ల శ్రీనివాస్



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 01 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** మునిసిపల్ ఎన్నికల సమయంలో, ప్రజలకు ఇచ్చిన హామీలను, ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని, అందోల్ -జోగిపేట, మున్సిపాలిటీ, 16వ వార్డ్ కౌన్సిలర్ పట్టోళ్ళ శ్రీనివాస్, తెలిపారు, 16వ వార్డు పరిధిలోని, ముత్యాలమ్మ గుడి వీధిలో, ఎన్నికలకు ముందు తన సొంత ఖర్చులతో ఏర్పాటుచేసిన, బోర్ కనెక్షన్ ను ఈరోజు గురువారం, ఇంటింటికి ఏర్పాటు చేయించారు, దీంతో స్థానిక ప్రజలకు, నీటి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది, ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీనివాస్, మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని, తన పదవి కాలంలో సాధ్యమైనంత మేరకు పూర్తి చేసేందుకు, కృషి చేస్తున్నామన్నారు, ప్రజల అవసరాలను గుర్తించి ప్రజల అవసరాలను గుర్తించి, వార్డు అభివృద్ధికి నిరంతరం పనిచేస్తానని తెలిపారు, 16వ వార్డును అన్ని రకాలుగా అభివృద్ధి చేసి, ఆదర్శవార్డుగా తీర్చిదిద్దడమే, తన లక్ష్యమని పేర్కొన్నారు

# అక్రమంగా కలప తరలిస్తే పట్టించుకోరా

గంగవరం రంపచోడవరం అడ్డతీ గల పరిసరాల ఏజెన్సీ ప్రాంతం నుండి ఎటువంటి అనుమతులు లేకుండా మైదాన ప్రాంతానికి తాటిపట్లు కలప రవాణా విచ్చలవిడిగా జరుగుతుంది. ఈ కలప రవాణాకు ఎటువంటి అనుమతులు లేవని సమాచారం. ఇంత కలప రవాణా మైదాన ప్రాంతానికి తరలి వెళ్ళిపోతున్న పోక్స్ పేట సూది కొండ రేంజ్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు విమర్శలు వస్తున్నాయి. పకృతి తాటి చెట్లతో పాటు విలువైన వివిధ రకాల కలప తరలి వెళ్ళిపోతుందని సమాచారం. ఈ కలప వ్యాపారం మొత్తం మైదాన ప్రాంతానికి సంబంధించిన వ్యాపారస్తులే తరలిస్తున్నారు. ఈ అక్రమ తరలింపులకు ఉన్నత అధికారులు జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# రాష్ట్రస్థారాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు జడ్పీహెచ్ఎస్ విద్యార్థినిలు ఎంపిక

తాండూర్ : రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు మంచిర్యాల జిల్లా అచ్చలాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థినిలు ఎంపికైనట్లు పీడీ ఏ సాంబమూర్తి తెలిపారు. ఆదిలాబాద్ ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గురువారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి రెజ్లింగ్ అండర్-14 62కేజీ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన పి అశ్విత ,అండర్-17 42 కేజీ విభాగంలో చౌల్ల హర్షిత , 72కేజీ విభాగంలో కే శ్రీవల్లి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. 35కేజీ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించిన ఎన్ నిత్య ప్రసన్న , 45కేజీ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన బి రమాదేవి , 38కేజీ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన జి అజయ్ ఎంపికయ్యారని తెలిపారు. మెడల్స్, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి ఉమాదేవి, ఉప సర్పంచ్ గట్టు సంతోష్ కుమార్, వార్డు సభ్యులు దాగం పాపయ్య, నాయకులు మారిశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు విద్యార్థులను అభినందించారు.

# తాళ్లపెంట భూములపై 'రికార్డుల' రగడ!

### పాస్‌బుక్కులు.. టైటిల్ డీడ్లు.. ఖాస్రా పహాణీలపై అనుమానాలు
### ప్రభుత్వ, అటవీ భూములపై హక్కుల కోసం అక్రమ యత్నాలంటూ ఆరోపణలు
### సబ్ కలెక్టర్‌కు గంగదేవిపాడు గ్రామస్తుల ఫిర్యాదు.. సమగ్ర విచారణకు డిమాండ్

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 1:** పెనుబల్లి మండలం తాళ్లపెంట రెవెన్యూ పరిధిలో భూముల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. రెవెన్యూ రికార్డులను టాంపరింగ్ చేసి తప్పుడు పాస్‌బుక్కులు, టైటిల్ డీడ్లు, ఖాస్రా పహాణీలు సృష్టించి ప్రభుత్వ, అటవీ భూములపై హక్కులు పొందేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని గంగదేవిపాడు గ్రామస్తులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కల్లూరు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

తాళ్లపెంట రెవెన్యూ పరిధిలోని బ్రహ్మళ్లకుంట సమీపంలో గతంలో, గంగదేవిపాడు గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 128 వద్ద ప్రస్తుతం భూములను చూపిస్తూ కొందరు వ్యక్తులు కోర్టులను ఆశ్రయిస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒకే రెవెన్యూ పరిధిలో వేర్వేరు ప్రాంతాలను చూపిస్తూ వరుసగా న్యాయస్థానాలను ఆశ్రయించడం వెనుక ఉన్న వాస్తవాలను నిగ్గ తేల్చాలని కోరారు.

పాత రికార్డులు.. కొత్త పత్రాలు!

2015 సంవత్సరానికి ముందు ఉన్న అసలు రెవెన్యూ రికార్డులు, ప్రస్తుత రికార్డుల మధ్య ఏమైనా మార్పులు జరిగాయా? పాస్‌బుక్కులు, టైటిల్ డీడ్లు, ఖాస్రా పహాణీలు ఏ ఆధారాలతో జారీ అయ్యాయి? వాటికి సంబంధిత రికార్డుల్లో ఎవరు చోటు కల్పించారు? అనే అంశాలపై పూర్తి స్థాయి విచారణ జరపాలని గ్రామస్తులు కోరారు.

సర్వే నంబర్ 128 పరిధిలో దశాబ్దాలుగా పేద గిరిజన, గిరిజనేతరులు సాగు చేసుకుంటున్న భూములు ఉన్నాయని, అటవీ హక్కు పత్రాలు కూడా ఉన్నాయని తెలిపారు. అయినప్పటికీ ఆ భూములపై హక్కులు పొందేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

సంయుక్త సర్వేకు డిమాండ్

రెవెన్యూ, అటవీ, సర్వే శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి వాస్తవ సరిహద్దులను నిర్ధారించాలని గ్రామస్తులు కోరారు. బ్రహ్మళ్లకుంట సమీపంలో గతంలో జరిగిన క్షేత్రస్థాయి పరిశీలన రికార్డులు, కోర్టులకు సమర్పించిన రెవెన్యూ, అటవీ శాఖ నివేదికలు, సర్వే నంబర్ 128కు సంబంధించిన రికార్డులు, హైకోర్టులో దాఖలైన రిట్ పిటిషన్ల వివరాలను పూర్తిగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

తప్పుడు పత్రాలు సృష్టించినట్లు విచారణలో తేలితే సంబంధిత వ్యక్తులతో పాటు వారికి సహకరించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ప్రభుత్వ, అటవీ భూములను పరిరక్షించడంతో పాటు గ్రామ ప్రజల హక్కులకు రక్షణ కల్పించాలని కోరారు.

త్వరిత విచారణకు హామీ

గ్రామస్తులు సమర్పించిన ఫిర్యాదును స్వీకరించిన సబ్ కలెక్టర్ త్వరగా విచారణ జరిపి, సంబంధిత వ్యక్తులు మరియు అధికారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

ఫిర్యాదు కార్యక్రమంలో బానోత్ హోమేశ్వరరావు, మాలోత్ హతిరాం, ఇస్లావత్ సోమ్లా, ఓర్సు వెంకన్న, భూక్యా భద్రు, ఈ. రాములు, దంతెలపల్లి వెంకటేశ్వర్లు, మాయర రాఘవులు, మల్లం పుల్లారావు, కాకా శ్రీను తదితరులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జ్ఞానేశ్ కుమార్‌ను సీఈ సి పదవి నుంచి తొలగించి కఠిన చర్యలు తీసుకోవాలి

### ఎస్ ఐ ఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలి
### సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి. దావూద్

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధిఅక్టోబర్ 01** ఏటూర్ నాగారం ఏటూరు నాగారం: ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్ ) ప్రక్రియపై వెలువడుతున్న అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సి ఈ సి) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించి కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి. దావూద్ డిమాండ్ చేశారు.ఎన్నికల జాబితాల సవరణ, ఎస్ ఐ ఆర్ ప్రక్రియకు సంబంధించిన కొన్ని నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్ల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నట్లు వచ్చిన నివేదికలు ఎన్నికల సంఘం నిర్ణయ ప్రక్రియపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయని దావూద్ అన్నారు. ఓటర్ల పేర్లను చేర్చడం, తొలగించడం వంటి అంశాలు నేరుగా ప్రజల ఓటు హక్కుతో ముడిపడి ఉన్నందున ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా ఉండాలని కోరారు. ఎస్ ఐ ఆర్ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించి ఉంటే వాటిని వెంటనే పరిశీలించి పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.



ఎస్ ఐ ఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేసి, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.ఎన్నికల సంఘం స్వతంత్రత, సమగ్రతపై ప్రజల్లో విశ్వాసం నిలిచేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో పూర్తి పారదర్శకత ఉండేలా చట్టపరమైన మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఈ డిమాండ్లపై సిపిఐ ఎం ఆధ్వర్యంలో ఏటూరు నాగారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.డి. దావూద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును పరిరక్షించేందుకు ప్రజలను చైతన్యపరుస్తామని, కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రవి, తోలెం కృష్ణయ్య, సురేష్,కోరం చిరంజీవి, కర్నె లాజర్, సంపత్, సమ్మయ్య ,నరసింహులు, పూనెం నగేష్, తదితరులు పాల్గొన్నారు

# ప్రకృతి వ్యవసాయం, నూనెగింజల సాగుపై రైతులకు అవగాహన.

### ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు,

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 01 ఏటూర్ నాగారం** బిఏటూరునాగారం వ్యవసాయ శాఖ ఏడీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో రైతు వేదికలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సుతో పాటు, ఆత్మ ఆధ్వర్యంలో వర్షాధార పరిస్థితుల్లో నూనెగింజల సాగుపై రైతులకు అవగాహన నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు, ఏటూరునాగారం బ్లాక్ ఆత్మ కమిటీ చైర్మన్ కర్ల అరుణ పాల్గొన్నారు.





ఈ సందర్భంగా చిటమట రఘు మాట్లాడుతూ.. భూమిని మన శరీరంలా భావించి సంరక్షించుకోవాలని అన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి సారవంతంగా ఉండటంతో పాటు, ఆరోగ్యకరమైన పంటలను ఉత్పత్తి చేయవచ్చని తెలిపారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు...

గతంలో రైతులు రసాయన ఎరువులు, పురుగుమందులు లేకుండా వరి, జొన్న, పెసర, మొక్కజొన్న, బొబ్బర్లు తదితర పంటలను సాగు చేసేవారని గుర్తు చేశారు. ఆరోగ్యకరమైన ఆహారం కోసం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు....

అదేవిధంగా వర్షాధార పరిస్థితుల్లో నూనెగింజల పంటల సాగు, ముఖ్యంగా వేరుశెనగ సాగుపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. రైతులు ఈ సూచనలను పాటించి తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులు సాధించాలని సూచించారు...

ఈ కార్యక్రమంలో ఏఓ రవికుమార్, ఏఈఓ రాజ్‌కుమార్, ఆత్మ డైరెక్టర్లు సోదరి రామయ్య, సునీల్ తదితర అధికారులు, రైతులు పాల్గొన్నారు...

# ములుగు జిల్లాలో 4 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ గ్రిడ్‌కు అనుసంధానం

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 01 2026 ములుగు** పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా ములుగు జిల్లాలో మరో ముందడుగు పడింది. ములుగు సర్కిల్, ములుగు డివిజన్ పరిధిలోని మల్లంపల్లి సెక్షన్, రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన బొక్క సునీల్ రెడ్డి, అపర్ణ పెంటా రెడ్డి ఏర్పాటు చేసిన 2o2 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ విద్యుత్ గ్రిడ్‌కు గురువారం అనుసంధానం చేశామని సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ బేతి బిక్షపతి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ సౌర విద్యుత్ ప్లాంట్ల గ్రిడ్ అనుసంధానం ద్వారా పర్యావరణహితమైన విద్యుత్ ఉత్పత్తికి మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం పెంపొందుతుంది. గ్రీన్ ఎనర్జీ కార్యక్రమాలను బలోపేతం చేయడంలో ఇటువంటి సౌర విద్యుత్ ప్రాజెక్టులు కీలకంగా నిలుస్తాయని తెలిపారు.ఈ రెండు ప్లాంట్లను విజయవంతంగా గ్రిడ్‌కు అనుసంధానం చేయడంలో సమన్వయంతో కృషి చేసిన ఆపరేషన్, ప్రొటెక్షన్ విభాగాల అధికారులు, సిబ్బందిని అధికారులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ములుగు, డీఈ రాజు , ఎంఆర్‌టీ అండ్ కన్‌స్ట్రక్షన్/భూపాలపల్లి, ఆపరేషన్, ప్రొటెక్షన్ విభాగాల అధికారులు పాల్గొన్నారు



# పట్లూర్ శరవేగంగా పూర్తవుతున్న అండర్ డ్రైనేజ్ పనులు

### గ్రామ సర్పంచ్ పరుశురాం



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 1 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ గ్రామంలో శరవేగంగా అండర్ డ్రైనేజ్ పనులు ముమ్మరంగ ముందుకు తీసుకెళ్తున్న గ్రామ సర్పంచ్ పరశు రాం, గ్రామంలో మోరీల వల్ల దోమలు చెత్తాచెదారం ఇలా ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురవుతున్నాయని గమనించి గ్రామ పెద్దల సమక్షంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పూర్తి చేయడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ పరశురాం తెలిపారు అండర్ డ్రైనేజ్ పైప్ లైన్ వేయడం వల్ల గలీలు శు భ్రంగా ఉంటాయి ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు సాధ్యమైనంత వరకు అండర్ డ్రైనేజ్ పనులు గ్రామాల్లో అవసరమైన చోట తప్పనిసరిగా వేసే దుకు కృషి చేస్తామని గ్రామ సర్పంచ్ పరశురాం తెలిపారు కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పరుశురాం, ఉప సర్పంచ్ అఖిల్, గ్రామ పెద్దలు గ్రామ సెక్రెటరీ గోపాల్ గ్రామ ప్రజలు అండర్ డ్రైనేజ్ పనులు చూసిప్రశంసించినట్టు తెలిపారు

# సింగరేణి గనుల విస్తరణకు కసరత్తు

### JVR OC-2లో ఉత్పత్తి పురోగతిపై డైరెక్టర్ తనిఖీ.. OC–3 ప్రాజెక్ట్ సరిహద్దులు, విస్తరణ అవకాశాలపై ప్రత్యేక సమీక్ష

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 1:** సత్తుపల్లి సింగరేణి ఏరియాలో బొగ్గు ఉత్పత్తి పెంపు, నాణ్యతా ప్రమాణాల మెరుగుదల, భవిష్యత్ ప్రాజెక్టుల వేగవంతమైన పురోగతిపై సంస్థ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ & ప్రాజెక్ట్స్) కే. వెంకటేశ్వర్లు గురువారం సత్తుపల్లి ఏరియాలో విస్తృతంగా పర్యటించారు.

ఈ సందర్భంగా జీVR OC-2లో బొగ్గు ఉత్పత్తి పురోగతిని పరిశీలించిన డైరెక్టర్.. గని నిర్వహణ, ఉత్పత్తి సామర్థ్యం, నాణ్యతా ప్రమాణాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం JVR EPC--CHP ద్వారా బొగ్గు రవాణా, విజయవాడ రోడ్ డైవర్షన్ తదితర అంశాలను పరిశీలించారు.



OC-3పై ప్రత్యేక దృష్టి

ప్రతిపాదిత JVR OC-3 ప్రాజెక్ట్ స్థలాన్ని డైరెక్టర్ స్వయంగా పరిశీలించారు. ప్రాజెక్ట్ సరిహద్దులు, గనుల విస్తరణకు ఉన్న అవకాశాలు, భౌగోళిక పరిస్థితులు, సాంకేతిక అనుకూలతలు, బొగ్గు రవాణా మార్గాలపై అధికారులతో చర్చించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా గనుల విస్తరణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు.

అనంతరం సత్తుపల్లి ఏరియా GM కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుత ఉత్పత్తి పరిస్థితులు, రవాణా వ్యవస్థ, నూతన ప్రాజెక్టుల పురోగతి తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.ఈ పర్యటనలో సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎస్. వెంకటచారితో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### మెడికల్ షాపులు, ఆసుపత్రులలో అధికారుల ముమ్మర తనిఖీలు

పల్నాడు నరసరావుపేటలో డ్రగ్స్ కంట్రోల్ అధికారులు టాస్క్‌ఫోర్స్ ఈగల్ టీమ్ సంయుక్తంగా వైద్య దుకాణాలు మెడికల్ షాపులు, ఆసుపత్రులు ల్యాబ్‌లపై ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు.కల్తీ మందుల నియంత్రణ, నిబంధనల ఉల్లంఘనలపై అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు.పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోని మల్లమ్మ సెంటర్, ఇతర ప్రధాన కూడళ్లలో ఉన్న మెడికల్ షాపులపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు అకస్మాత్తుగా దాడులు చేశారు.నిబంధనలు పాటించని మరియు అర్హత కలిగిన ఫార్మసిస్ట్ లేకుండా మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించి వాటిపై తగిన చర్యలు తీసుకున్నారు.

# ఉచిత గుండె, క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం




**మెదక్ ఉమ్మడి జిల్లా ప్రజాబలం ప్రతినిధి యెదుగని అంజయ్య :** లయన్స్ క్లబ్ ఆఫ్ రామాయంపేట ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని వంజరి సంఘం భవనంలో ఉచిత గుండె, క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్‌పై వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్యుల సూచనలు, సలహాలు అందించారు. దాదాపు 200 మంది శిబిరాన్ని సందర్శించి టెస్టులు చేయించుకొని డాక్టర్ సలహాలు సూచనలు సంబంధిత మెడిసిన్స్ తీసుకోవడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పి డిజిపిఓ నరసింహారెడ్డి, టిడిపి చారి, ఫాస్ట్ డిస్టిక్ గవర్నమెంట్, సీఐ సైదా నాయక్, ఎస్సై బి రాజేష్, సర్పంచ్ నరేందర్, ఉప సర్పంచ్ బాబు, రామయంపేట లైన్స్ క్లబ్ అధ్యక్షుడు జీడి తిరుపతి గౌడ్, డిస్టిక్ సెక్రటరీలు దేమే యాదగిరి, లక్ష్మణ్ యాదవ్, వంగర కైలాసం, శివకుమార్, రమేష్, ఎండి అజ్గర్, నాయిని వెంకటేశం, చీకోటి వెంకటేశం, మహేష్, సిద్ధరామరెడ్డి, వినయ్, భూపతి తదితరులు పాల్గొన్నారు.








# సీనియర్ సిటిజన్లు పోలీస్ స్టేషన్లకు వస్తే అత్యంత ప్రాధాన్యతతో సేవలందించాలి : డీసీపీ రామ్‌రెడ్డి



**పెద్దపల్లి, అక్టోబర్ -01, ప్రజాబలం ప్రతినిధి:** సీనియర్ సిటిజన్లు పోలీస్ స్టేషన్లకు ఏదైనా పనిమీద వచ్చినప్పుడు వారికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, వారి సమస్యలను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని డీసీపీ రామ్‌రెడ్డి తెలిపారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకల్లో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనిజ కోయిర్కర్‌తో కలిసి డీసీపీ రామ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ రామ్‌రెడ్డి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లకు వచ్చే సీనియర్ సిటిజన్ల పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో ఎక్కడైనా ఇబ్బంది ఎదురైతే 112కు లేదా నేరుగా తనకు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని తెలిపారు. జిల్లా కలెక్టర్ దృష్టికి వచ్చే వృద్ధుల సమస్యలకు సానుకూలంగా స్పందిస్తూ సకాలంలో పరిష్కారం చూపేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని అన్నారు.

సీనియర్ సిటిజన్స్ చట్టాన్ని ఉపయోగించి తెలంగాణలో పిల్లల పేరున రిజిస్ట్రేషన్ చేసిన భూములను రద్దు చేసి, తిరిగి వృద్ధ తల్లిదండ్రుల పేరున రిజిస్ట్రేషన్ చేసిన సందర్భాలు పెద్దపల్లి జిల్లాలోనే చోటుచేసుకున్నాయని డీసీపీ తెలిపారు. వృద్ధుల హక్కులు, సంక్షేమం పట్ల జిల్లా యంత్రాంగం చూపుతున్న ప్రత్యేక శ్రద్ధకు ఇది నిదర్శనమని డీసీపీ తెలిపారు. వృద్ధులు తమ సమస్యలు, సూచనలను అధికారుల దృష్టికి తీసుకురావాలని డీసీపీ కోరారు. సుల్తానాబాద్‌లో ప్రభుత్వ వృద్ధాశ్రమం అందుబాటులో ఉందని తెలిపారు. బస్‌స్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లు తదితర ప్రాంతాల్లో అనాథలు లేదా ఆదరణ లేని వృద్ధులు కనిపిస్తే వారిని గుర్తించి ప్రభుత్వ వృద్ధాశ్రమానికి తరలించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వయోవృద్ధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ డైరెక్టర్ కృష్ణమూర్తి, డీఆర్‌డీఏ కాళిందిని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర, కలెక్టరేట్ పరిపాలన అధికారి బండి ప్రకాష్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రవీందర్, రిటైర్డ్ జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య, రిటైర్డ్ బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, వయోవృద్ధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి జూపల్లి కృష్ణా రావు ను ఘెరావ్ చేసిన కళాకారులు

హైదరాబాద్ రవీంద్ర భారతి లోమంత్రి ఆఫీస్ ముందు మంతరి జూపల్లి కృష్ణారావును కళాకారులు అడ్డుకున్నారు. బుధవారం రవీంద్ర భారతి ముట్టడికి కళాకారులు పిలుపు నిచ్చిన విషయం తెలిసిందే. రెండో రోజు రవీంద్ర భారతీ లో మంత్రి ఆఫీస్ ఆందోళన కు దిగారు. అర్హులైన కళాకారులకు తెలంగాణ సాంస్కృతిక సారథి లో ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేసారు. 1000 ఉద్యోగాలు కల్పించాలని మంత్రి విజ్ఞప్తి చేసారు. మంత్రి బయటకు వెళ్లకుండా ఆందోళన చేసారు. మంత్రి కాళ్ళపై పడి వేడుకున్నారు. మంత్రి కళారులను తొసుకుంటూ వెళ్లిపోయారు. మరోసారి మంత్రి వాహనాన్ని కళాకారులు అడ్డుకున్నారు.

# గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛ భారత్ కార్యక్రమం





**జి ప్రవీణ్ కుమార్ ప్రజాబలం రిపోర్టర్ కాజీపేట** వరంగల్ నగరంలోని ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్య ఆసుపత్రి ఆవరణలో గాంధీ జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనసూయ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి ఎస్ కె ధర్మరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, జాతీయ సేవా పథకం (NSS) విద్యార్థులు, హౌస్ సర్జన్లు, వైస్ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా , ఆసుపత్రి ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని నిర్వాహకులు పేర్కొన్నారు.

కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ధర్మరాజు విద్యార్థులతో మాట్లాడుతూ, స్వచ్ఛత అనేది కేవలం ఒకరోజు నిర్వహించే కార్యక్రమం కాదని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో పాటించాల్సిన బాధ్యత అని అన్నారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, ఇతరులకు కూడా పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు.

జాతీయ సేవా పథకం (NSS) ద్వారా విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యత, పరిశుభ్రత పట్ల అవగాహన పెంపొందించడం ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు సమాజంలో మార్పుకు మార్గదర్శకులుగా నిలవాలని సూచించారు.

ఈ స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో

డాక్టర్. అనసూయ, డాక్టర్. జి ఎస్ కె ధర్మరాజు

డాక్టర్.రమాదేవి, డాక్టర్ విజయ్ జ్ఞానేశ్వర్ రెడ్డి, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శ్రీకృష్ణ సీనియర్ వైద్యులు, డాక్టర్ హరి కిషన్, డాక్టర్ సాంబమూర్తి, శ్రావణ్ ,

ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి,

డాక్టర్ పోతుల మహేష్ మరియు వైద్య విద్యార్థులు సుమారు 150 మంది విద్యార్థులు, వైద్యులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రుద్రాక్షపల్లిలో అభివృద్ధి పండుగ.. రూ.కోట్ల పనులకు శ్రీకారం

**1200 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ.. 28 సీసీ రోడ్ల ప్రారంభం**
**సీసీ కెమెరాలు, టీవీ ఏర్పాటు..**
**వైకుంఠధామంలో ఉచిత కట్టెల పంపిణీకి హామీ**

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 1 :** సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి గ్రామంలో గురువారం అభివృద్ధి కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ముఖ్య అతిథిగా హాజరై పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.



రుద్రాక్షపల్లి పంచాయతీ పరిధిలోని రుద్రాక్షపల్లి, కొమ్ముగూడెం, బాసారం, తోగ్గుడెం, రంగాపురం, సత్యంపేట గ్రామాల్లో నిర్మాణం పూర్తయిన 28 సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే పంచాయతీ ప్రజలకు సుమారు 1,200 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.



రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు

రుద్రాక్షపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఇప్పటివరకు సుమారు రూ.4 కోట్లతో సత్తెమ్మ గుడి రోడ్డు, మూడు శ్రీశక్తి భవనాలు, ఆర్వో వాటర్ ప్లాంట్, సోలార్ మోటార్లు, సోలార్ లైట్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి విడతలో 42 ఇళ్లు మంజూరైన విషయాన్ని కూడా ఆమె వివరించారు.



సీసీ కెమెరాలు, టీవీ ఏర్పాటు

గ్రామ భద్రత, ప్రజలకు సమాచార సౌకర్యం కల్పించేందుకు రుద్రాక్షపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన 10 సీసీ కెమెరాలు, టీవీని ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

వైకుంఠధామంలో ఉచిత కట్టెలు

రుద్రాక్షపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలకు అవసరమైన కట్టెలను ఉచితంగా అందించే ఏర్పాట్లు చేయనున్నట్లు ఎమ్మెల్యే రాగమయి దయానంద్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, ఎంపీడీవో, రుద్రాక్షపల్లి సర్పంచ్ పాయం నాగేంద్రబాబు, ఉపసర్పంచ్ భూపతిరెడ్డి, సత్తుపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, నాయకులు భరత్‌కుమార్ బత్తుల, దామోదర్‌రావు పిన్నమనేని, హలావత్ అర్జున్, వసంతరావు, సారా రవి, సోయం సత్యం, తాటి నాగేష్ తదితరులు పాల్గొన్నారు. వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, ప్రజలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# అలరించిన ఒంగోలు గిత్తల ప్రదర్శన

ఒంగోలు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోనే ఉన్న ఏకైక నగరపాలక సంస్థ ఒంగోలు. ఎన్నో ఏళ్లుగా జిల్లాకే ప్రధాన వాణిజ్య, వ్యాపారం కేంద్రంగా ఉంది. అనేక రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతూ ప్రస్తుతం 150 ఏళ్లు పూర్తి చేసుకుంది.ఒంగోలు పేరు వినగానే మొదటగా అందిరికి గుర్తుకు వచ్చేది గిత్తలు. ఈ ఒంగోలు గిత్తలకు రాష్ట్రంలోనే కాకుండా దేశ, విదేశాల్లోనూ మంచి గుర్తింపు ఉంది. బలమైన శరీర నిర్మాణం, కష్టాన్ని తట్టుకునే సామర్థ్యం, ఎత్తు, వెడల్పుగా ఉండే నుదురు ఇలా ఎన్నో ప్రత్యేకతలు వీటి సొంతం.ఒంగోలు మున్సిపాలిటీ ఏర్పడి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒంగోలు గిత్తల ప్రదర్శన ఆద్యాంతం అలరించాయి.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com